RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో
అనుభవం ఉన్న వారు
నియోజకవర్గ, జిల్లా విలేకరులు కావలెను
స్థానిక వార్తల సేకరణ
ఫోటోలు, వీడియోలు సేకరించగల వారు
రచనా నైపుణ్యం కలిగి ఉండాలి
ప్రజలతో మమేకం కాలిగిన వారు అధిక ప్రాధాన్యం
ఆసక్తగల వారు వెంటనే సంప్రదించండి
మిగితా వివరాల కోసం
9391832673

RNI NO. TELTEL/2014/61071

జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :181 | శనివారం అక్టోబర్ 24, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 8 | వెల-5

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశం.. డిండి, అచ్చంపేటకు అదనపు నీటి కేటాయింపులు



రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులు, నిర్మాణ ప్రతిపాదనలపై కీలక చర్చలు జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2లో

సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి:



అరుణాచల్ సరిహద్దులో భారత్--చైనా ఘర్షణలు!

ఘర్షణలు కొనసాగుతున్నట్లు ఐటీబీపీ డీజీ వెల్లడి.

గల్వాన్ తరహా పోరుకు ప్రత్యేక శిక్షణ.

కేంద్రం సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్ డిమాండ్.

చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘర్షణలను ధ్రువీకరిస్తూ వెలువడిన తొలి ప్రకటన ఇదే కావడం గమనార్హం. "అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

2లో

నవంబర్ 3 నుంచి ఇండో--పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

ఢిల్లీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న భారత నౌకాదళం

శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారంపై 18 దేశాల నిపుణుల చర్చలు

2లో



బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీకి వర్ష సూచన



2లో

దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

పోలీసు శాఖల్లో సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర సంస్కరణలతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి

దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సంస్కరణలు తీసుకురావాలని, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ (రాజ్రాజజ) సమావేశాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.



2లో

రపట్టభద్రుల ఓటరు నమోదుకు యువత భారీగా తరలిరావాలి:

మంత్రి పొన్నం ప్రభాకర్



వివరాలు 2 లో..

కంటోన్మెంట్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం.. సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నేతల ప్రచారం

: అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని టీచర్స్ కాలనీ పార్క్ వద్ద హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ పాల్గొన్నారు. ఓటరు నమోదుకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

నవంబర్ 6 వరకు ఓటరు నమోదుకు అవకాశం

ఎమ్మెల్యే శగణేశ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి

చంద్రబాబుతో మరోసారి పవన్ భేటీ..

సీట్ల సర్దుబాటుపై చర్చ



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. పలుచోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సీఎం నివాసానికి పవన్ చేరుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న నేపథ్యంలో కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంట పాటు వీరిద్దరూ చర్చించారు. తెదేపా, జనసేన, భాజపాలోని ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఏకాభిప్రాయం సాధించే అంశంపై చంద్రబాబు, పవన్ చర్చించారు. గురువారం కూడా సీఎంతో పవన్ సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించిన విషయం తెలిసిందే.

మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి



ప్రారంభించిన నెల రోజుల్లోనే మంచి స్పందన మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 3,885 కాల్స్

2లో

ఎన్నికలు జరగకుండా చేయాలన్నదే వైకాపా కుట్ర



2లో

విజయవాడ: ఎలాగైనా ఎన్నికలు జరగకుండా చేయాలన్నదే వైకాపా కుట్ర అని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ ఆరోపించారు. అందుకే అభ్యర్థుల చేతిలో నామినేషన్లు లాక్కొని చించేశారని మండిపడ్డారు. విధ్వంసం వాళ్లు సృష్టించి.. ఆ నెపం తెదేపాపై పెడుతున్నారని ఆక్షేపించారు. పుంగనూరుతోపాటు చాలా చోట్ల వైకాపా విధ్వంసానికి పాల్పడిందని మండిపడ్డారు.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 24, 2026

సంపాదకీయం

ఓటు హక్కు తొలగింపు చిన్న విషయమా?

ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కోట్లాది వయోజన భారతీయుల ఓటుహక్కు తొలగింపునకు దారితీసిందా? భారీ స్థాయిలో ఓటుహక్కు రద్దుపై వెల్లువెత్తిన విమర్శలను కొట్టివేస్తూ... చిన్న విషయంపై పెద్ద రభస చేస్తున్నారని అర్థశాస్త్ర విజ్ఞుడు సుర్జిత్ భల్లా విమర్శలు చేస్తున్న దృష్ట్యా పై ప్రశ్నను మరింత నిశితంగా తర్కించవలసిన అవసరమున్నది.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభం కాకముందు ఉన్న ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపుల పైనే 'సర్' చర్చలన్నీ ప్రధానంగా జరుగుతున్నాయి. సర్ పూర్వపు ఓటర్ జాబితాల నుంచి 13.3 కోట్ల పేర్లను తొలగించడమే భారీ స్థాయి ఓటుహక్కు రద్దునకు రుజువు అని ఈ విమర్శకులు ప్రస్తావిస్తున్నారు. అయితే గత ఓటర్ జాబితాలలో పేర్లు అత్యధికంగా ఉన్నాయని తొలగించిన పేర్లు అన్నీ ఓటర్ నమోదులో లేనివారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, మరణించినవారు, ఒకే పేరు రెండుసార్లు ఉన్నవారివేనని సర్ మద్దతుదారులు ప్రతిస్పందిస్తున్నారు. నిజానిజాలు ఏమిటి? భారత ఎన్నికల సంఘం రూపొందించిన సర్ తుది జాబితాలు సరైనవేనని విశ్వసనీయ తనిఖీతో ధ్రువీకరించడం జరగకపోవడంతో వాటిపై గందరగోళం, వివాదాలు నెలకొన్నాయి. అయితే సర్ ఫలితాలను మూల్యాంకనం చేసేందుకు ఒక వివేకవంతమైన పద్ధతి ఉన్నది. సర్ తుది ఓటర్ జాబితాలను ఓటుహక్కుకు అర్హత ఉన్న వయోజన జనాభా అధికారిక అంచనాలతో పోల్చిచూడడం ద్వారా సర్ నిష్పాక్షికతను తెలుసుకోవచ్చు. నిజానికి ఈసీఐ సైతం ఓటర్ జాబితాలను మూల్యాంకనం చేసేందుకు అధికారిక వయోజన జనాభా అంచనాలను ఒక ప్రమాణంగా తీసుకుంటున్నది. కోట్లాది వయోజనుల ఓటుహక్కును రద్దు చేశారన్న ఆరోపణ సమర్థనీయమైనదేనని సర్ తుది ఓటర్ జాబితాలు, వయోజన జనాభా అంచనాల తులనాత్మక పరిశీలన స్పష్టం చేసింది. అంతేకాదు తుది జాబితాలలో పేర్లు లేనివారి సంఖ్యపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి రావడానికి కూడా అది తోడ్పడింది. సర్ ప్రక్రియ ప్రథమ, ద్వితీయ దశలు అమలయిన తొమ్మిది రాష్ట్రాలలో తుది జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్రాలలోని సమస్త వయోజన జనాభా అంచనాలకు 7 కోట్ల కంటే తక్కువగా ఉన్నది. దాదాపు 12శాతం వయోజనులను తుది జాబితాల నుంచి మినహాయించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. యూపీలో ఇలా ఓటు హక్కు కోల్పోయినవారు మొత్తం వయోజన జనాభాలో 17శాతానికంటే అధికం. ఈ తొమ్మిది రాష్ట్రాలలో సగటు తొలగింపుల రేటు 12శాతం దేశవ్యాప్తంగా మొత్తం తొలగింపులకు కూడా సూచకమయితే తుది ఓటర్ జాబితాలలో లేనివారు దాదాపు 12 కోట్ల మందిగా ఉంటారు. మూడో దశ సర్ ధోరణులను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ సంఖ్య మరింత అధికంగా ఉండవచ్చు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ--కశ్మీర్ మినహా మిగతా రాష్ట్రాలు అన్నిటికీ ముసాయిదా సర్ జాబితాలను విడుదల చేశారు. ముసాయిదా జాబితాలలోనే తొలగింపులు సర్ మూడో దశలో మరింత అధికంగా ఉన్నాయి. మొదటి రెండు దశల ముసాయిదా జాబితాలను సరిదిద్దిన విధంగానే మూడో దశ జాబితాలలోనూ మార్పులు చేయడం జరగవచ్చని భావిద్దాం. అయినప్పటికీ అఖిల భారత స్థాయిలో సర్ అనంతర తుది ఓటర్ జాబితాలలో ఉండే పేర్లు ఇంచుమించు 87.8 కోట్లుగా ఉండగలవని రాహుల్ శాస్త్రి అంచనా వేశారు.

భారతదేశ ప్రస్తుత వయోజన జనాభా 101.6 కోట్లు. అంటే ఓటు హక్కుకు అర్హులైన దాదాపు 14 కోట్లమంది తుది జాబితాల నుంచి జారిపోయారు. వయోజన జనాభా పరిమాణం, ఓటర్ జాబితాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సుర్జిత్ భల్లా అంగీకరిస్తూనే, ఈ తేడా ఓటుహక్కు తొలగింపులను సూచించదని వాదిస్తున్నారు. ఓటర్ జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య వయోజన జనాభా సంఖ్యతో సరిసమానంగా ఉండి తీరాలని ఏమీ లేదని ఆయన వాదన. 2024లో ఓటుహక్కుకు అర్హమైన వయసుకు వచ్చిన వారిలో ఎంతోమంది ఓటరుగా నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ చూపలేదని, ఇటువంటి అలక్ష్యపరులు ఆ ఏడాది మొత్తం వయోజనులలో 7.5శాతంగా ఉన్నారని భల్లా చెబుతున్నారు. మిగిలిన జనాభాలోనూ ఇటువంటి తక్కువ నమోదును మరో 1శాతం మేరకు కలుపుకుంటే సాధారణంగా వాటిల్లే లోటు 8.5శాతంగా ఉండగలదని ఆయన నిర్ధారిస్తూ, ఈ 8.5శాతం పరిమితి కంటే ఎక్కువ ఉంటేనే, దానిని మితిమీరినదిగా, న్యాయ విరుద్ధమైనదిగా పరిగణించాలనేది సుర్జిత్ భల్లా వాదన.

ఎడిటర్ చైతన్య

రపట్టభద్రుల ఓటరు నమోదుకు యువత

భారీగా తరలిరావాలి:

మొదటిపేజీ తరువాయి

పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం తప్పనిసరని పేర్కొన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటరు నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టభద్రులందరి ఓట్లను నమోదు చేయించేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల సమస్యలపై గళమెత్తే సామర్థ్యం ఉన్న యువ నాయకుడు సామ రామ్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు సహా వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు.

పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వాలు, సంబంధిత వేదికల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

ఓటు హక్కును కాపాడుకోవాలి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు హక్కు పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, పట్టభద్రులు తమ హక్కులను వినియోగించుకోవడంతోపా టు తమ సమస్యలను ప్రాతినిధ్యం వహించే నాయకులను ఎన్నుకోవడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం..
ఏపీకి వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి

అమరావతి: తూర్పు మధ్య- ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. శనివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా రూపాంతరం చెందనుంది. ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడి.. ఈ నెల 26 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉంది. తుపాను ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని కోరింది.

దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య నేరాల నియంత్రణ, సమాచార మార్పిడి, సరిహద్దులు దాటి పోలీసు సమన్వయం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలిచింది.

పోలీసింగ్‌లో నిరంతర సంస్కరణలు అవసరం

సమాజానికి భద్రత, రక్షణ అత్యంత ముఖ్యమైన పునాదులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమర్థవంతంగా, నైతిక విలువలతో, నిష్పక్షపాతంగా పనిచేసే పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాలను కూడా ఎప్పటికప్పుడు ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు వ్యవస్థకు అందించే వనరులను కేవలం ఖర్చుగా కాకుండా, మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు చేసే పెట్టుబడిగా పరిగణిస్తున్నామని వివరించారు. సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, ప్రతి పోలీసు విభాగం తన పనితీరును మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

హైదరాబాద్‌లో మూడు పోలీసు కమిషనరేట్లు

నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కమిషనర్ తన పరిధిలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

అలాగే వివిధ రకాల నేరాలు, ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు హైడ్రా , ఈగల్ , టీ -సేఫ్ వంటి విభాగాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలను ప్రధాన సవాళ్లుగా పేర్కొంటూ, వీటి నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక శిక్షణ, సమర్థవంతమైన కార్యాచరణ అవసరమని అన్నారు.

తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోలీసు సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, నక్సలిజం నిర్మూలన వంటి రంగాల్లో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని చెప్పారు.

ప్రధాని నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం కేంద్ర ప్రభుత్వం నుంచి 80 శాతానికి పైగా మార్కులు సాధించిందని తెలిపారు. సైబర్ నేరాల బాధితులకు పోగొట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించే విషయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందన్నారు.

ఆహార కల్తీ నియంత్రణకు టీజీ -సేఫ్

ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను పటిష్టం చేయడం కోసం వివిధ విభాగాల ప్రయత్నాలను సమన్వయం చేసేందుకు అమెరికాలోని ఎఫ్డీఏ తరహాలో టీజీ -సేఫ్ అనే కొత్త విభాగాన్ని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక విభాగాల పనితీరు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించడం ద్వారా తెలంగాణ దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం

విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పోలీసుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు పోలీసు సిబ్బంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా నిలిచేందుకు, కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు హోదా, సర్వీసు ఆధారంగా కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబాలకు గృహ నిర్మాణ స్థలాలు కేటాయించడంతోపాటు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి

మొదటిపేజీ తరువాయి



తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దార్శనిక నాయకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే సేవలను అందించేందుకు మీ సేవా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది.

ప్రజలు ఇకపై ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ నమోదు, ఆధార్ వివరాల అప్ డేట్ వంటి పలు సేవలను తమ ఇంటి వద్దనే పొందవచ్చు.లి ఇందుకోసం మీ సేవా కేంద్రాలు లేదా ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, క్యూలలో వేచి ఉండకుండా మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ సేవ ద్వారా సేవలను పొందే అవకాశం కల్పించారు. ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1100 కు కాల్ చేయడం, మీసేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఆతర్వాత మీ సేవా ప్రతినిధి నిర్ణీత సమయంలో ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.ప్రారంభం నుంచే లభించిన మంచి స్పందనలి

ఈ సేవ ప్రారంభమైన మొదటి నెలలోనే 1100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ప్రజల నుంచి 3,885 కాల్స్ వచ్చాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, పారదర్శకమైన పాలనను అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దార్శనికతలో ఈ కార్యక్రమం ఒక భాగం.

ప్రస్తుతం ఈ డోర్‌స్టెప్ సేవలు క్యూర్ (క్యూర్) పరిధిలోని ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బుక్ చేసుకున్న సర్వీస్ ప్రకారం వర్తించే సేవా రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

డోర్ స్టెప్ సేవలను ఎలా పొందాలి..?

1. టోల్‌ఫ్రీ నంబర్ ?1100కు కాల్ చేయండి లేదా మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయండి.

2. అవసరమైన ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ సేవను ఎంచుకుని, కాల్ సెంటర్ ప్రతినిధికి అవసరమైన వివరాలను అందించండి.3. నిర్ణయించిన సమయంలో మీ సేవా డోర్‌స్టెప్ ప్రతినిధి మీ ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

మొదటిపేజీ తరువాయి

మహారాష్ట్రతో త్వరలో చర్చలు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు జరిపేందుకు సిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ తర్వాత చర్చలకు పిలుస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో చర్చలకు అవసరమైన అన్ని నివేదికలు, సాంకేతిక వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది, మహారాష్ట్ర పరిధిలో ఎంత మేర భూమి ముంపునకు గురవుతుంది అనే అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అటవీ ప్రాంతాలు, గిరిజనులు అధికంగా నివసించే వెనుకబడిన ప్రాంతాలతో కూడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా బ్యారేజీ ఎత్తు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో చర్చించిన అంశాలు, వాటికి సంబంధించిన వివరాలన్నింటినీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర సమన్వయం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, ముంపు ప్రభావంపై సమగ్ర సమాచారంతో చర్చలకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

డిండి, అచ్చంపేటకు అదనపు నీరు

డిండి ప్రాజెక్టు, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యత పెంచే దిశగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అవసరాల కోసం మొత్తం 0.6 టీఎంసీల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని ఏదుల రిజర్వాయర్ వరకు తీసుకువచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా డిండి, అచ్చంపేట ప్రాంతాల అవసరాలను తీర్చడంతోపాటు పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. నీటిని తరలించేందుకు అవసరమైన పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర సాంకేతిక వ్యవస్థల ఏర్పాటును వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నీటి కేటాయింపులు, అంతర్రాష్ట్ర చర్చలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో జరగనున్న చర్చలు, డిండి--అచ్చంపేట పథకాలకు అదనపు నీటిని తరలించేందుకు చేపట్టే ఏర్పాట్లు తదుపరి కీలక పరిణామాలుగా నిలవనున్నాయి.

సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి:

మొదటిపేజీ తరువాయి

ఈ ఘర్షణల సమయంలో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు" అని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటీబీపీని ఏర్పాటు చేశారు. 2004లో మనకు చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారు" అని అన్నారు.

జమ్మూకశ్మీర్‌పై భారత్‌దే సార్వభౌమాధికారం

చైనా నే అత్యంత క్లిష్టమైన సరిహద్దు అని ఆయన అంగీకరించారు. గల్వాన్ తరహా ఘర్షణలను మెరుగ్గా ఎదుర్కోవడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేశామని, భూగర్భ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని తెలియజేశారు. చైనాతో ఉన్న 3,488 కి.మీ. పొడవైన వాస్తవాధీన రేఖ వెంబడి ఈ ఐటీబీపీ పహారా కాస్తుంటుంది. ఎత్తైన ప్రదేశంలో జరిగే ఘర్షణలను ఎదుర్కోవడం శౌర్య కమాండోల ప్రత్యేకత.

దేశానికి సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

అరుణాచల్ వద్ద చైనా సైన్యంతో ఘర్షణలు జరిగినట్లు ఐటీబీపీ చీఫ్ వెల్లడించడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ అంశంపై దేశానికి సమాధానం చెప్పకుండా కేంద్ర ప్రభుత్వం మౌనాన్ని పాటిస్తోందని విమర్శించింది. ఇలా ఘర్షణలు జరుగుతున్నప్పటికీ చైనాకు మాత్రం రాయితీలను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టింది. "లద్దాఖ్‌లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లు చేజారిపోయాయని స్థానికులు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాల పేర్లను చైనా మారుస్తూనే ఉంది. మనకు ముప్పు కలిగించే ఆనకట్టను నిర్మిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ భద్రతకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు దేశానికి కావాలి" అని డిమాండ్ చేసింది.

నవంబర్ 3 నుంచి ఇండో-- పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

మొదటిపేజీ తరువాయి

ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారత నౌకాదళం నవంబర్ 3 నుంచి 5 వరకు న్యూఢిల్లీలో ఇండో--పసిఫిక్ రీజినల్ డైలాగ్--2026 (ఐపీఆర్‌డీ) నిర్వహించనుంది. నేషనల్ మారిటైమ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ అంతర్జాతీయ వ్యూహాత్మక సదస్సులో 18 దేశాలకు చెందిన నిపుణులు పాల్గొననున్నారు.

'ఇండో--పసిఫిక్‌లో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారం' ప్రధాన ఇతివృత్తంగా సదస్సు జరగనుంది. సముద్ర పరిశోధనలు, విద్యాసంస్థల అనుసంధానం, మానవ వనరుల అభివృద్ధి, సముద్ర పాలన, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించనున్నారు.

భారత్ ప్రతిపాదించిన ఇండో--పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లోని సహకార అంశాలను ఆచరణాత్మక ప్రతిపాదనలుగా మలచడంపై సదస్సు దృష్టి సారించనుంది. 'మహాసాగర్' సముద్ర దార్శనికతకు అనుగుణంగా ప్రాంతీయ భద్రత, అభివృద్ధికి భాగస్వామ్యాలను ప్రోత్సహించనుంది.

మూడు రోజుల కార్యక్రమంలో ఐదు ప్రధాన చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యా--పరిశోధన నెట్‌వర్క్‌లు, కీలక సముద్ర మౌలిక వసతుల రక్షణ, సముద్ర విజ్ఞానం, వాతావరణ సవాళ్లు, సముద్ర పాలనలో సహకారం, పౌర--రక్షణ రంగాల్లో ఉపయోగపడే సాంకేతికతల ప్రభావాలు తదితర అంశాలను పరిశీలించనున్నారు. సంయుక్త పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, శాస్త్రీయ సమాచార మార్పిడి, సంస్థాగత భాగస్వామ్యాలకు కార్యాచరణ మార్గాలను చర్చించనున్నారు.

ప్రారంభ రోజున 'పర్‌స్పెక్టివ్స్ ఫ్రమ్ ది ఫ్లాగ్ బ్రిడ్జ్' ప్రత్యేక సమావేశంలో భారత్, శ్రీలంక మాజీ నౌకాదళాధిపతులు పాల్గొననున్నారు. 'సహయోగ్ కా సంవాద్' పేరిట రాయబారులతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలి రోజు స్మారకోపన్యాసం చేయనున్నారు.

వాతావరణ మార్పులు, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు, సముద్ర వనరులపై ఒత్తిడి వంటి సరిహద్దులు దాటిన సవాళ్లకు ఉమ్మడి పరిష్కారాలను అన్వేషించనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు సామాజిక, జీవ శాస్త్రాలు, మానవీయ శాస్త్రాల పాత్రనూ పరిశీలించనున్నారు. జాతీయ, ఉపప్రాంతీయ, ప్రాంతీయ స్థాయుల్లో అమలు చేయగల నిర్దిష్ట చర్యలను గుర్తించడమే సదస్సు ప్రధాన లక్ష్యం.

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 24, 2026

సురక్షిత దక్షిణ భారతమే లక్ష్యంగా ....ఉమ్మడి సెక్రటేరియట్ ఏర్పాటు

- నేరస్థుల సమాచార మార్పిడికి ....వ్యవస్థీకృత నిర్మాణం
- పోలీసు వ్యవస్థపై చేసే వ్యయం సమాజ భద్రత, మెరుగైన భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడి: సీఎం రేవంత్ రెడ్డి
- నేరాల కట్టడికి ఉమ్మడిగా సెక్రటేరియట్, నోడల్ అధికారులను నియామకం: డిజిపి సి వి ఆనంద్
- ఐసీసీసీలో డిజిపిలు, ఐజిల సమావేశం లో పోలీసులు విధానాలపై ప్రజెంటేషన్
- ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల కట్టడిపై చర్చ
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణ, ఉమ్మడి సహకారం, కార్యాచరణ
- మావోయిస్టుల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణకు ఈ స్థాయి గుర్తింపు.
- దేశంలోనే ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ



హైదరాబాద్, అక్టోబరు 23: జన

దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసుకొని, సరిహద్దులు దాటి మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థలో విస్తృత సంస్కరణలు,

నేరాల నియంత్రణకు పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

శుక్ర వారం హైదరాబాదులోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ సమావేశానికి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన డిజిపిలు, ఐజీలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో, సి బి ఐ, రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ, సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, సిఆర్పిఎఫ్, ఎన్ ఎస్ జి , సి డి ఐ టి సంస్థల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల పోలీస్ అధికారులు వారి ఉత్తమ పోలీసు విధానాలను వివరించారు.

ప్రధాన అంశాలపై చర్చ

ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు,

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలు, నేరగాళ్ల సమాచార మార్పిడి, నేరాల దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, ఆయా రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయం నూతన నేర చట్టాలు , పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వంటి అంశాలపైనా విస్తృతంగా చర్చించారు .

దక్షిణ భారతాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి సీఎం

ఈ సందర్భంగా సదస్సును ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...పోలీసు వ్యవస్థపై చేసే వ్యయం సమాజ భద్రత, మెరుగైన భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడిగా భావించాలన్నారు.

హైదరాబాద్ ప్రాంతంలో పోలీసు వ్యవస్థను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మూడు కమిషనరేట్లుగా విభజించడం ద్వారా స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం కలిగిందన్నారు. నేరాల స్వరూపానికి అనుగుణంగా హైడ్రా, ఈగిల్, టి సేఫ్, టి మార్స్ వంటి ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేశామని వివరించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక విభాగాలు దృష్టి సాధిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, తెలంగాణ పోలీసులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ప్రధానమంత్రి ప్రగతి సమీక్ష సమావేశంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహితంగా మార్చడంలో కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అభినందించారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగిల్ ఫోర్స్‌కు కేంద్ర ప్రభుత్వ అంచనాల్లో 80 శాతానికి పైగా మార్కులు లభించాయని తెలిపారు. సైబర్ మోసాల బాధితులకు డబ్బు తిరిగి అందించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. అమెరికాలోని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తరహాలో ఆహార కల్తీ, ఔషధాల నియంత్రణకు సంబంధించిన చర్యలను సమన్వయం చేసేందుకు టీ సేఫ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. చెరువులు, జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించిన దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమన్న ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా పోలీసు స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు హోదా, సర్వీసును బట్టి కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా,ఇంటి స్థలాలు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఏ ఒక్క రాష్ట్రం తనంతట తానుగా నేరరహితంగా మారలేదని, ముఖ్యంగా సరిహద్దులు దాటి జరిగే నేరాలను అరికట్టేందుకు రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం అత్యవసరమని పేర్కొన్నారు. సమావేశంలో విస్తృత చర్చల అనంతరం పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, పోలీసు ప్రధాన కార్యాలయాల మధ్య సమాచార మార్పిడి, పరస్పర సహకారం కోసం సమర్థమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణ భారతాన్ని సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు శాఖలపై ఉందని పేర్కొంటూ, పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక మౌలిక సదుపాయాలు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను పంచుకునేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. సమష్టి కృషితో సురక్షిత దక్షిణ భారతాన్ని నిర్మించాలని పిలుపునిస్తూ, సమావేశం విజయవంతం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

నేరాల కట్టడికి ఉమ్మడిగా సెక్రటేరియట్, నోడల్ అధికారులను నియామకం: డిజిపి సి వి ఆనంద్

నేరాల కట్టడికి దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి కార్యాచరణ తో పాటు ఉమ్మడి సెక్రటేరియట్ ను ఏర్పాటు చేసి, అన్ని దక్షిణాది రాష్ట్రాలు నోడల్ అధికారులను మించాలని డిజిపి ల సమన్వయ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదాన్ని సమర్థంగా అరికట్టేందుకు రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సమన్వయాన్ని బలోపేతం చేయాలని ఈ సమావేశంలో డిజిపి పిలుపునిచ్చారు.

మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖ ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి, సిబ్బంది నైపుణ్యాలను సమర్థంగా వినియోగిస్తోందని డిజిపి సి. వి. ఆనంద్ తెలిపారు.

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, రహదారి భద్రత వరకు కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు వ్యవస్థను ఆధునికీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

గతంలో మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టేందుకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి, జిల్లా పోలీసుల సమన్వయంతో సమర్థవంతమైన ఆపరేషన్లు నిర్వహించామని వివరించారు. ఈ కృషితో తెలంగాణ నక్సల్స్ రహిత రాష్ట్రంగా ఎదిగి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ విజయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనేందుకు ఆక్టోపస్ పని చేస్తుంది. మాదకద్రవ్యాల ముప్పుల ముందుగానే గుర్తించి, 2023లో ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ ఈగల్ ఫోర్స్ కు అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు సిబ్బందికి 30 శాతం అదనపు వేతనాన్ని మంజూరు చేశామన్నారు.

ఈ విభాగం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలువురు డ్రగ్స్ నేరస్థులను పట్టుకుందని పేర్కొన్నారు. గత సెప్టెంబరు 22న న్యూ ఢిల్లీ లో జరిగిన సమావేశంలో డ్రగ్స్ నియంత్రణ చర్యలకు గాను ఈగల్ ఫోర్స్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా జాతీయ స్థాయి పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు.

సైబర్ నేరాల బాధితులకు ఉపశమనం కల్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కీలకంగా పనిచేస్తోందన్నారు. సైబర్ మోసాల బాధితులకు పోర్టళ్ల ద్వారా రూ.69.4 కోట్లను తిరిగి అందించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ప్రగతి సమీక్షలో సైబర్ భద్రతా విభాగం వరుసగా రెండుసార్లు జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం పోలీసు శాఖ పనితీరుకు నిదర్శనమన్నారు.

తెలంగాణలో 824 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరి కదిలికపై ఎస్ఐబి నిఘా కూడా ఉంచమన్నారు.

నక్సల్స్ అంతరించడంతో అడవుల్లో కూంబింగ్ అవసరం తగ్గడంతో గ్రేహౌండ్స్, ఎస్ఐబీ, ఆక్టోపస్ సిబ్బందిని పునర్వ్యవస్థీకరించి రోడ్ సేఫ్టీ, టీజీ సేఫ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలకు వినియోగిస్తున్నట్లు వివరించారు. ఆహార పదార్థాల కల్తీని అరికట్టేందుకు టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో రూ.600 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా లక్షకు పైగా సీసీ కెమెరాలను అనుసంధానించి, పోలీసు కార్యకలాపాలు, విపత్తుల నిర్వహణ, వివిధ శాఖల సమన్వయాన్ని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వం ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రత కు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేశామన్నారు.

పోలీసు శాఖ ఎదుర్కొంటున్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించేందుకు టీఎస్ పార్క్‌ను ప్రారంభించామని, సాంకేతిక సామర్థ్యాలను పెంచి నేర నియంత్రణకు ఆధునిక విధానాలను అభివృద్ధి చేయడమే దీని లక్ష్యమని డీజీపీ వివరించారు.

నేరస్థుల సమాచార మార్పిడి...

నేరస్థుల సమాచార మార్పిడి, డేటా షేరింగ్‌ను బలోపేతం చేయడంతో పాటు అన్ని రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి రాష్ట్రం నుంచి నోడల్ అధికారులను నియమించి, క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్లు డిజిపి పేర్కొన్నారు.

బెస్ట్ పోలీసింగ్ ప్రాక్టీస్ పైన ప్రెసెంటేషన్స్....

తమిళనాడు డిజిపి డాక్టర్ మహేష్ అగర్వాల్... మహిళలు, పిల్లల భద్రతతోపాటు పోలీసు సిబ్బంది మానసిక ఆరోగ్యానికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సింగప్పన్, 'కావల్ కరంగల్'(ఖ్ఖుఖ్ఖుశ్రీ ఖ్ఖుఖ్ఖుఅస్త్రుశ్రీ) కార్యక్రమం ద్వారా ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ నియంత్రణ వంటి అంశాల్లో సిబ్బందికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. 'మగిళ్చి' (ఖ్ఖుస్త్ర-అశ్రీఎష్ట్రఅ)కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించి, ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటి సమస్యలున్న పోలీసు సిబ్బందికి మానసిక సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల కింద 2,008 కేసులు నమోదు కాగా, 41,915 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 367 ఫిర్యాదులను పరిష్కరించినట్లు వివరించారు.

కేరళం ఐజి అజిత బేగం....పాఠశాలల్లో స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ కార్యక్రమం ద్వారా 1,201 పాఠశాలల్లో 98 వేల మందికి శిక్షణ అందించినట్లు అధికారులు తెలిపారు. 484 జనమైత్రి పోలీస్ స్టేషన్ల ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 148 చైల్డ్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లలో పిల్లలకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

పుదుచ్చేరి డిజిపి శాలిని సింగ్....

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకు 2025లో 'మక్కల్ మండ్రం' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా 98 శాతం ఫిర్యాదులను పరిష్కరించినట్లు వెల్లడించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను హింస నుంచి రక్షించి, స్వీయ రక్షణలో శిక్షణ ఇచ్చేందుకు 2025 మార్చిలో 'మిషన్ వీరమంగై' ప్రారంభించినట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్లకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ఐజి ఈగల్ రవికృష్ణ....గంజాయి నిర్మూలనకు 'ఆపరేషన్ చైతన్యం' కింద చేపడుతున్న చర్యలను వివరించారు. గంజాయి అక్రమ రవాణాను గుర్తించడం, గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మాదకద్రవ్యాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలతోపాటు మహిళలు, పిల్లల ఆచూకీ గుర్తించేందుకు చేపట్టిన 'ఆపరేషన్ ట్రేస్' వివరాలను వెల్లడించారు. 2025 ఆగస్టు నుంచి 2026 ఆగస్టు వరకు 11,242 మంది తప్పిపోయిన మహిళలు, పిల్లలను గుర్తించినట్లు తెలిపారు.

లక్షద్వీప్, ఏ డి జి శంకర్ జైస్వాల్ ....తీర ప్రాంత భద్రతను బలోపేతం చేసేందుకు మత్స్యకారులతో సమన్వయం, తీర గ్రామాల్లో పర్యటనలు, జాతీయ పర్వదినాల్లో జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. 'సాగర్ కవచ్' పేరుతో ఏడాదికి రెండుసార్లు, 'సాగర్' పేరుతో నెలకోసారి తీర భద్రతా విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'సీ విజిల్' కార్యక్రమంతోపాటు తీర ప్రాంత గస్తీ, పర్యాటకుల రాకపోకలు, అనుమతుల పర్యవేక్షణకు సంబంధించిన విధానాలను వివరించారు. 'తట్ కవచ్'(ఫ్ ఖ్ఖుఖ్ఖుఎష్ట్ర జూశీఖ్ఖుశ్రీ) వ- జూవతీఎఱ్ పోర్టల్ ద్వారా తీర భద్రతకు సంబంధించిన సమాచార నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు.

సెక్రటేరియట్ ఏర్పాటు, అధికారుల నియామకం ...

వివిధ రాష్ట్రాలకు చెందిన నేరస్థుల సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంతోపాటు, సమన్వయం కోసం ప్రత్యేక సెక్రటేరియట్ ఏర్పాటు చేసి అధికారులను నియమించాలని నిర్ణయించారు. సరిహద్దు రాష్ట్రాల మధ్య సహకారంతో నేరాల నియంత్రణకు సమష్టిగా కృషి చేయాలని అధికారులు ఉమ్మడి కార్యాచరణ దిశగా మార్గదర్శకాలను రూపొందించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లోని వివిధ విభాగాలను సందర్శించారు. వివిధ విభాగాల గురించి డిజిపి ఆనంద్ అధికారులకు అధికారులకు వివరించారు.

ఈ సమావేశానికి డిజిపి సి వి ఆనంద్ అధ్యక్షత వహించగా, డిజి మహేష్ భగవత్ సమావేశానికి సెక్రటరీగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల పోలీసు పాటుగా ఉన్నతాధికారులతో పాటుగా డైరెక్టర్ ఈగల్ సందీప్ శాండిల్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో శిఖా గోయల్ డైరెక్టర్ , టి జి పి ఎ డైరెక్టర్ అభిలాష బిస్తూ, సి ఐ డి డి జి చారు సిన్హా, డిజి అనిల్ కుమార్, హైదరాబాద్ సిపి వి సి సజ్జనర్, , ఇంటిలిజెంట్ ఏ డి జి విజయ్ కుమార్ తో పాటుగా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

అక్రమ బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయ స్థావరాలపై రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ దాడులు -- ముగ్గురు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

ప్రజా భద్రతను పరిరక్షించడంలో భాగంగా, అగ్నిప్రమాదాలను నివారించడానికి రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ బృందం, హైదరాబాద్ సిటీ, అత్తాపూర్ మైలార్‌దేవ్‌పల్లి లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి ఉమ్మడిగా సోదాలు నిర్వహించింది. 21.10.2026 మరియు 22.10.2026 తేదీలలో అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు జరిపి, తగిన లైసెన్స్‌లు లేకుండా, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించకుండా చట్టవిరుద్ధంగా బాణాసంచా తయారుచేస్తూ, నిల్వ ఉంచి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

1. జలాల్ బాబా నగర్ (అత్తాపూర్) లో దాడి (తేదీ: 21.10.2026): 21.10.2026న అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్ బాబా నగర్, 9వ నంబర్ వద్ద ఉన్న జరీనా సుల్తానా నివాసంపై రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. సంబంధిత అధికారుల నుండి ఎలాంటి లైసెన్స్ పొందకుండా, తగిన భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణాసంచా తయారుచేస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వ్యక్తుల వివరాలు:

1.జరీనా సుల్తానా, భర్త: సయ్యద్ ఇస్మాయిల్, వయస్సు: 60 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: జలాల్ బాబా నగర్, 9వ నంబర్, అత్తాపూర్.

2.మహ్మద్ అజార్, తండ్రి: మెహబూబ్ పాషా, వయస్సు: 36 సంవత్సరాలు, వృత్తి: మెడికల్ స్టోర్, నివాసం: జలాల్ బాబా నగర్, 9వ నంబర్, అత్తాపూర్.



స్వాధీనం చేసుకున్న సొత్తు:

లూజ్ బాణాసంచా (పాట్ పాట్ క్రాకర్స్) -- 4 బస్తాలు

బాణాసంచా మసాలా పొడి -- సుమారు 500 గ్రాములు

పొటాషియం పొడి -- సుమారు 500 గ్రాములు

2. శక్తి ట్రేడర్స్, బాబుల్ రెడ్డి నగర్ (మైలార్‌దేవ్‌పల్లి) లో దాడి (తేదీ: 22.10.2026): 22.10.2026న మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో ఉన్న 'శక్తి ట్రేడర్స్' అనే హోల్‌సేల్ బాణాసంచా దుకాణంపై రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. తగిన భద్రతా ప్రమాణాలు పాటించకుండా, అక్రమంగా బాణాసంచాను నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వ్యక్తి వివరాలు:

1. హఫీజ్ మేఘాని, తండ్రి: బాబు భాయ్, వయస్సు: 46 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఎస్.ఎన్. రెసిడెన్సీ పక్కన, బిజెపి ఆఫీస్ దగ్గర, ఉప్పర్‌పల్లి, రాజేంద్రనగర్.

స్వాధీనం చేసుకున్న సొత్తు:

బి.డి. బాంబులు (దీణ దీశీఎఎం) -- 7 కార్టన్ పెట్టెలు

పాప్-అప్స్ (ూశీజూ-బజూం) -- 6 కార్టన్ పెట్టెలు

వండర్ క్రాకర్స్ (ఔశీఅఎవతీ ఎఖ్ఖుఎఎవతీం) -- 3 కార్టన్ పెట్టెలు

ప్రజా భద్రతకు భంగం కలిగిస్తూ, అగ్నిప్రమాదాలకు కారణమయ్యే అక్రమ బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయాలను గుర్తించి నిరోధించడానికి రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ బృందం తమ ప్రయత్నాలను కొనసాగిస్తోంది. వర్తించే చట్టాలు, భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

ప్రజలకు సూచన: మీ పరిధిలో అక్రమంగా బాణాసంచా తయారీ, నిల్వ, రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్-112 లేదా హైదరాబాద్ సిటీ పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించగలరు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి.

డిఫెన్స్ లిక్కర్ పట్టివేత విలువ: 25 వేలు



హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు వెన్నెలగడ్డ చెరువు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా సుంకం చెల్లించని మద్యం (డిఫెన్స్ లిక్కర్) రవాణా చేస్తున్న వ్యక్తి శ్రీ ఇమ్మడి.నవీన్ ూ/శీ బొందయ్య, (33) హస్మత్పేట్, బోయిన్ పల్లి వద్ద (9) మద్యం సీసాలు ఒక్కొక్కటి 750ఎశ్రీ లభించాయి. అందులో (5) బ్లాక్ డాగ్ బాటిల్స్, (4) 100 పేపర్స్ బాటిల్స్ మొత్తం (6.750 లీటర్ల డిఫెన్స్ లిక్కర్)ఉన్నట్లుగా గుర్తించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ టి.లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. సదరు వ్యక్తినీ పూర్తిగా విచారించగా అతడు సైనికపురి దగ్గర ఒక డిఫెన్స్ ఉద్యోగి వద్ద కొని ఇక్కడ అమ్మడానికి తీసుకొనివచ్చి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడని ఈ సుంకం చెల్లించని డిఫెన్స్ లిక్కర్ విలువ సుమారుగా ? 25వేలు ఉంటుందని తెలిపారు. ఆ డిఫెన్స్ అధికారి కొరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఈ దాడులలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ పి.ఉమా మహేశ్వర్, సిబ్బంది గౌస్, కిషన్, రమేష్, శివ ప్రసాద్, సురేష్,విజయలక్ష్మి పాల్గొన్నారు. సిబ్బందిని అభినందించారు.

కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చాలా మిలిటరీ క్యాంటీన్ లు ఉన్నాయని తెలియక శుభకార్యాల కోసం ప్రజలు వారి వద్ద తక్కువ ధరకు కొని అమ్ముకోవడం, రవాణా చేయడం చట్టరీత్య నేరమని తెలియజేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మద్యం కలిగి ఉన్నా రవాణా చేసినా ఇతరులకు అమ్మినా చట్ట పరంగా శిక్షింపబడతారని తెలుపుతూ వెంటనే సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

అత్తాపూర్‌లో గంజాయితో పాటు తుపాకీ, తూటాలు స్వాధీనం

హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్తాపూర్‌లో పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఎండు గంజాయితో పాటు తుపాకీ, పిస్టల్, తూటాలను స్వాధీనం చేసుకున్నారు.

నమ్మకమైన సమాచారం మేరకు శుక్రవారం నిర్వహించిన ఈ దాడుల్లో సర్దార్ రాజా సింగ్ రంజీత్ సింగ్ అనే యువకుడి నుంచి నిషేధిత మాదక ద్రవ్యాలతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..

అత్తాపూర్‌లోని సిక్ చౌనీ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా, నిందితుడి వద్ద నుంచి సుమారు 1.5 కిలోల ఎండు గంజాయి, ఒక తుపాకీ, ఒక పిస్టల్, ఐదు తూటాలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

గంజాయిని మంగల్‌హాట్‌కు చెందిన రాహుల్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు నిందితుడు తెలిపినట్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. పిస్టల్‌ను మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించినప్పటికీ, తుపాకీ, తూటాలకు సంబంధించి సరైన వివరాలు తెలియజేయలేదని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ ఘటనపై ఎక్సైజ్ సిఐలు ఇతర టీములు విచారణ చేపట్టారు. దూల్పేట్ సిఐ ప్రవీణ్ కుమార్, రాజేంద్రనగర్ ఎక్సైజ్ సిఐ



RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 24, 2026

తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు

152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా వాదనలు

ఈనెల 23 తర్వాత చర్చలకు సానుకూలత తెలిపిన మహారాష్ట్ర సీఎం

ఏదుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు

పాలమూరు నీటికి గండి పడకుండా అదనపు నీటి తరలింపు

శ్రీశైలం నుంచి ఏదుల వరకు అదనంగా 0.6 టీఎంసీల లిఫ్టింగ్

నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని సీఎం వెల్లడించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు.

తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే వీలుంది.. 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సీఎంకు వివరించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని వివరించారు.

మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకొని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు.



ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో జరిగిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యుసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని సీఎం వివరించారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలని అన్నారు.

అందుకే తుమ్మడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత.. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సీఎం ఆదేశించారు.

గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీల్లేదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, వాళ్లు కోరిన నివేదికలన్నీ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు.

డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌజ్లు అమర్చాలి.. ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా.. లేదా ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి.. అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు.

నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలనే విషయంలో మహబూబ్నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది.. ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు.

మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు.

సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రెటరీ మాణిక్రాజ్ తో పాటు సెక్రెటరీ (టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రా తో పాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం త్వరలో ఏర్పాటు

కార్మికుల హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం

పరిశ్రమల అభివృద్ధి--కార్మికుల సంక్షేమం రెండూ ముఖ్యం

శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, అక్టోబరు 23 జన తెలంగాణ



అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరుగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన నిబంధనలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో "సోషల్ డెమోక్రసీ, పొలిటికల్ లీడర్‌షిప్ అండ్ ట్రేడ్ యూనియన్స్: రీబిల్డింగ్ ది ఆర్కిటెక్చర్ ఆఫ్ సోషల్ డైలాగ్" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, భవిష్యత్తులో పని విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మిక రంగాన్ని సిద్ధం చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు.

దేశంలోని సుమారు 93 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. సంఘటిత రంగ కార్మికులకు ట్రేడ్ యూనియన్ల ద్వారా తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం పోరాడే అవకాశం ఉందని, అసంఘటిత రంగ కార్మికులకు ఆ స్థాయిలో ప్రాతినిధ్యం, రక్షణ లేదని అన్నారు. ఈ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి మరిన్ని చర్చలు, విధానపరమైన చర్యలు అవసరమన్నారు.

తన తండ్రి గడ్డం వెంకటస్వామి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టే సమయంలో పారిశ్రామిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చినా, కార్మికుల ప్రయోజనాల కోసం ఆయన అండగా నిలిచారని తెలిపారు.

గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ చేపట్టిన చొరవను మంత్రి ప్రస్తావించారు. రాహుల్ గాంధీ చొరవతోనే తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టాన్ని తీసుకొచ్చామని, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత నిబంధనలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

హమాలీ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరు సంక్షేమ బోర్డుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల హక్కులు, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, పని ప్రదేశాల్లో భద్రత వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

తెలంగాణలో గత పదేళ్లుగా కనీస వేతనాలను ప్రకటించలేదని, తాను కార్మిక శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత కనీస వేతనాలను ప్రకటించామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో పరిశ్రమల ప్రతినిధులతో చర్చించి, కార్మికులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

కార్మికులకు తగిన వేతనాలు, గౌరవప్రదమైన జీవనం అందినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని, పరిశ్రమల్లో పారిశ్రామిక శాంతి నెలకొంటుందని వివరించారు. పరిశ్రమలు, కార్మికులు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించరాదని మంత్రి అన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఫ్యాక్టరీల తనిఖీల సందర్భంగా అధికారులు సూచించిన భద్రతా చర్యలను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు.

తనిఖీ నివేదికలను కంపెనీల బోర్డు సమావేశాల్లో చర్చించి, భద్రతా లోపాలను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ బాధ్యతలను గుర్తించి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు.

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు నైపుణ్యాభివృద్ధి కీలకమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (కూజం) అభివృద్ధి చేస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వస్తున్న కొత్త పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జర్మనీలో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అవకాశాలు ఉన్నాయని, అక్కడి సంస్థలతో చర్చల సందర్భంగా సుమారు 5 లక్షల ఉద్యోగ అవకాశాల గురించి ప్రస్తావన వచ్చిందని చెప్పారు.

తన నియోజకవర్గంలోని మందమర్రిలో 70 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నామని, వారికి తన సంస్థ తరఫున స్టైపెండ్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు జర్మనీలో ఉపాధి కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. యూరప్, జపాన్ తదితర దేశాల్లో మారుతున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా స్థానిక భాషలు, ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ పొందడం అవసరమన్నారు.

విధాన నిర్ణయాల్లో కార్మికులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. బలమైన ట్రేడ్ యూనియన్లు, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, అర్థవంతమైన సామాజిక సంభాషణ ద్వారా న్యాయబద్ధమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు.

కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ ప్రతినిధులు, నిపుణులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్మిక సంస్కరణలు పరిశ్రమల అభివృద్ధికి దోహదపడటంతో పాటు కార్మికుల హక్కులను పరిరక్షించేలా ఉండాలని చెప్పారు. సదస్సులో వచ్చే ఆచరణాత్మక సూచనలను పరిశీలించి, కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా సాధ్యమైన మేరకు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, మాజీ ఎంపీ ఖంతియా , తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ

గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు -- మంత్రి వాకిటి శ్రీహరి

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు.. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక.. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు డ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై శు క్రవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం-మంత్రి వాకిటి శ్రీహరి

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు.

క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం-మంత్రి వాకిటి శ్రీహరి

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతోపాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా నిర్వహణ-మంత్రి శ్రీహరి

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు తెలంగాణ క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలని పేర్కొన్నారు.

సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ మద్దతు కోరాం: టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

హిమాయత్‌నగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ నాయకులను కోరినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ నాయకుల మధ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెండు పార్టీల మధ్య రాజకీయ సమన్వయం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తదితర అంశాలపై చర్చించారు.ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో సీపీఐతో కలిసి ముందుకు సాగుతున్నామని తెలిపారు. రానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సీపీఐ మద్దతు కోరినట్లు వెల్లడించారు. అలాగే, ఎన్నికల్లో మద్దతు కోసం సీపీఎంతోనూ చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. సీపీఐ తరఫున రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

అలాగే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఈటీ నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, కలవేని శంకర్, బాల నరసింహ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ఖ= కరెంటు ఉందో లేదో కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తది

చనగాని దయాకర్ టీపీసీసీ జనరల్ సెక్రటరీ

హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

ఖ= కరెంటు ఉందో లేదో కరెంట్ తీగలు పట్టుకుంటే తెలుస్తదనీ అన్నారు

ఎల్ నినో కూడా రాజకీయం చేస్తారా

ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ మార్పు

ఎక్కడ విద్యుత్ కొరతలు లేకుండా , రైతాంగాన్ని ఎక్కడ నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందనీ తెలిపారు

మంత్రి వర్గ కమిటీ వేసి రాష్ట్రంలో కరువు పైన అవగాహన కార్యక్రమాలు చేపట్టింది, రైతులకు అండగా నిలిచిందనీ పేర్కొన్నారు

ఖ= నీచ రాజకీయాలు మానుకొని భాధ్యత కలిగిన ప్రతి పక్ష పాత్ర పోషించాలని కోరుకుంటున్నాం అని

రాష్ట్రంలో విద్యుత్తు సంక్షోభం రాకుండా ఉండేందుకు జెన్కో పాంట్ల లో దాదాపు 140 మిలియన్ల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది ఖ= సమర్థ అవినీతి పాలన తోనే రాష్ట్రంలో ప్రతి ప్రాజెక్ట్ లో అవినీతి తెగ పడ్డారన్నారు

ఖ= పైన వచ్చిన అవినీతి అక్రమాలపైన ఎందుకు చర్చకు రావడం లేదనీ. మండిపడ్డారు

ఖ= మీసాల మీద గడ్డం పైన ఆలోచన ప్రజల పైన లేదు అన్నారు.

ఖ= రైతుల గురించి మాట్లాడితే సిగ్గవుతుంది, పది ఏండ్లు రైతులకు ఏమీ చేశారో చెప్పగలరా కేటీఆర్???

రాసి పెట్టుకో నీకు అధికారం అనేది కల రేవంత్ రెడ్డి



గారు ఉన్నన్ని రోజులు అది సాధ్యం కాదు అన్నారు...

రేవంత్ రెడ్డి పాలనలో ఎల్ నినో ప్రభావం నుండి బయట పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు

రాష్ట్ర ప్రజలు కలిసి కరోనా కట్టడి కోసం కృషి చేశామో ఎల్ నినో పైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలకు సన్నాహాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ

నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కులు, గ్రీనరీ అవసరాలకు శుద్ధి చేసిన నీరు

భూగర్భ జలాల పరిరక్షణ, తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం

ట్యాంకర్లకు ప్రత్యేక బ్రాండింగ్, జీపీఎస్.. ఫిల్లింగ్ స్టేషన్లలో ఈ-పోస్ యంత్రాలు

బుకింగ్ నుంచి డెలివరీ వరకు పర్యవేక్షణకు ప్రత్యేక ఆన్‌లైన్ వేదిక

నవంబర్ 1 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలి: జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి



హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు భూగర్భ జలాల పరిరక్షణతో పాటు తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఇందులో భాగంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కులు, గ్రీనరీ, ఇతర తాగునీరు అవసరం లేని పనులకు వినియోగించేలా నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రానున్న ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగాన్ని పెంచేందుకు చేపడుతున్న చర్యలపై శుక్రవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్షించారు. గ్రీన్ వాటర్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్యాంకర్ల నమోదు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థల ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

డిమాండ్‌కు అనుగుణంగా ఫిల్లింగ్ స్టేషన్లు:

నిర్మాణ రంగం, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన నీటికి ఉన్న డిమాండ్‌ను ప్రాంతాలవారీగా అంచనా వేయాలని ఎండీ సూచించారు. అందుకు అనుగుణంగా సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఎస్టీపీలను గుర్తించి గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫిల్లింగ్ పాయింట్లు, ప్లాట్‌ఫారాలు, పంపింగ్ సదుపాయాలు, ఫ్లో మీటర్లు, ఇతర మౌలిక వసతులను సమకూర్చాలని పేర్కొన్నారు.

ట్యాంకర్లకు ప్రత్యేక బ్రాండింగ్.. జీపీఎస్ తప్పనిసరి

గ్రీన్ వాటర్ సరఫరాలో పారదర్శకత ఉండేలా ప్రతి ట్యాంకర్‌కు ప్రత్యేక బ్రాండింగ్‌తో పాటు జీపీఎస్ పరికరాన్ని తప్పనిసరిగా అమర్చాలని ఎండీ ఆదేశించారు. ట్యాంకర్ల కదలికలు, సరఫరా సమయాలు, డెలివరీ వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

ప్రతి ఫిల్లింగ్ స్టేషన్‌లో ఈ-పోస్ యంత్రాలను ఏర్పాటు చేసి, ట్యాంకర్లలో నింపే నీటి పరిమాణం, బుకింగ్, సరఫరా వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

బుకింగ్ నుంచి డెలివరీ వరకు ఆన్‌లైన్ పర్యవేక్షణ:

గ్రీన్ వాటర్ ట్యాంకర్ల నమోదు, వినియోగదారుల రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ బుకింగ్, ట్యాంకర్ కేటాయింపు, జీపీఎస్ ట్రాకింగ్, డిజిటల్ చెల్లింపులు, డెలివరీ నిర్ధారణ వంటి సేవలన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉండేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేయాలని ఎండీ సూచించారు.

సొంత ట్యాంకర్లు కలిగిన వినియోగదారులు కూడా నిర్దేశిత నిబంధనల మేరకు ఈ సేవలను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ట్యాంకర్లు లేని వినియోగదారులకు జలమండలిలో నమోదైన ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం:

నిర్మాణ పనులు, మొక్కల పెంపకం, పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ వంటి అవసరాలకు తాగునీరు, భూగర్భ జలాలను వినియోగించకుండా శుద్ధి చేసిన నీటిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఎండీ సూచించారు.

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, బిల్డర్లు, డెవలపర్లు, పారిశ్రామిక సంఘాలతో సమన్వయం చేసుకొని గ్రీన్ వాటర్ వినియోగాన్ని విస్తరించాలని ఆదేశించారు.

నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ:

గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లలో శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని ఎండీ ఆదేశించారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, శుద్ధి చేసిన నీటిని తాగునీరు అవసరం లేని పనులకు మాత్రమే వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రీన్ వాటర్ వినియోగంపై విస్తృత ప్రచారం:

గ్రీన్ వాటర్ సేవలపై నిర్మాణ సంస్థలు, పరిశ్రమలు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఎండీ సూచించారు. బుకింగ్ విధానం, ఫిల్లింగ్ స్టేషన్ల వివరాలు, శుద్ధి చేసిన నీటి వినియోగ ప్రయోజనాలను ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన సాంకేతిక, నిర్వహణ ఏర్పాట్లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మూడు రీజియన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పంకజ, సామ్రాట్ అశోక్, సంతోష్, టెక్నికల్ డైరెక్టర్ ప్రభు, డైరెక్టర్లు నారాయణ, వాసా సత్యనారాయణ, కిరణ్ కుమార్, వివిధ విభాగాల చీఫ్ జనరల్ మేనేజర్లు (సీజీఎంలు), ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మార్పు మనతోనే మొదలవ్వాలి.. మనమే అందరికీ ఆదర్శంగా నిలవాలి

నీరు, విద్యుత్ పొదుపుపై జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి పిలుపు

జలమండలి కార్యాలయాల్లో 20 శాతం నీరు, విద్యుత్ పొదుపు తప్పనిసరి

ఏసీల ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ వద్దే ఉంచాలి

సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీల వినియోగం నిలిపివేయాలి

ఏసీల నుంచి వెలువడే నీటిని సేకరించి పునర్వినియోగించాలి

నీటి లీకేజీలను వెంటనే అరికట్టాలి.. అనవసర విద్యుత్ వినియోగాన్ని నియంత్రించాలి

పొదుపు చర్యల అమలుపై అధికారులదే బాధ్యత.. నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

పొదుపులో ముందున్న వారికి ప్రశంసాపత్రాలు



హైదరాబాద్ అక్టోబర్ 23 జన తెలంగాణ

మార్పు మనతోనే మొదలవ్వాలి.. మనమే అందరికీ ఆదర్శంగా నిలవాలి. నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు చెప్పే ముందు మనమే ఆచరించి చూపాలి" అని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. జలమండలి పరిధిలోని అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ వినియోగాన్ని కనీసం 20 శాతం తగ్గించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రానున్న ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి వనరుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాలంటే ముందుగా జలమండలి కార్యాలయాల్లోనే ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ మేరకు అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ పొదుపునకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఏసీల వినియోగంపై ప్రత్యేక నియంత్రణ:అన్ని కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల ఉష్ణోగ్రతను తప్పనిసరిగా 25 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంచాలని ఎండీ ఆదేశించారు.

సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని నిలిపివేయాలని స్పష్టం చేశారు. అత్యవసర నిర్వహణ అవసరాల కోసం సంబంధిత ఉన్నతాధికారుల ప్రత్యేక అనుమతి ఉన్న సందర్భాల్లో మాత్రమే మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.ఏసీల నుంచి వెలువడే నీటిని వృథాగా పోనివ్వకుండా సేకరించి, మొక్కల పెంపకం, శుభ్రత, ఇతర తాగునీరు అవసరం లేని పనులకు పునర్వినియోగించాలని సూచించారు.నీటి లీకేజీలకు తక్షణమే అడ్డుకట్ట:కార్యాలయ భవనాలు, మరుగుదొడ్లు, పైప్‌లైన్లు, నల్లాలు, నీటి నిల్వ ట్యాంకులు, ఇతర ప్రాంతాల్లో లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు వృథా కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

అనవసర విద్యుత్ వినియోగాన్ని నియంత్రించాలి:

కార్యాలయాల్లో అవసరం లేని సమయాల్లో లైట్లు, ఫ్యాన్లు, కంప్యూటర్లు, ఇతర విద్యుత్ పరికరాలను తప్పనిసరిగా ఆఫ్ చేయాలని ఎండీ ఆదేశించారు. ముఖ్యంగా కార్యాలయ సమయాలు ముగిసిన తర్వాత అనవసర విద్యుత్ వినియోగం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి విద్యుత్ పొదుపును వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

పొదుపు లక్ష్యాలపై నిరంతర పర్యవేక్షణ:

ప్రతి కార్యాలయంలో నీరు, విద్యుత్ వినియోగ వివరాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని ఎండీ ఆదేశించారు. గత వినియోగంతో పోల్చి కనీసం 20 శాతం పొదుపు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నిబంధనల అమలుకు సంబంధిత కార్యాలయ అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

నీరు, విద్యుత్ వృథా విషయంలో నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, పొదుపు చర్యల అమలులో ఎలాంటి అలసత్వానికి తావులేదని హెచ్చరించారు.

పొదుపు మన నుంచే ప్రారంభం కావాలి:

నీటి పొదుపు కేవలం ప్రచార కార్యక్రమంగా మిగిలిపోకూడదని, జలమండలి వ్యవస్థలోనే ఆచరణలో కనిపించాలని ఎండీ పేర్కొన్నారు. ప్రతి అధికారి, ఉద్యోగి నీరు, విద్యుత్ సంరక్షణను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

చిన్నచిన్న పొదుపు చర్యలను ప్రతి ఉద్యోగి నిత్య అలవాటుగా మార్చుకుంటే గణనీయమైన నీరు, విద్యుత్ ఆదా సాధించవచ్చన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి 20 శాతం పొదుపు లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు.

మనం మారకుండా సమాజాన్ని మార్చలేం.. మనం ఆచరించకుండా ఇతరులకు చెప్పలేం. అందుకే నీరు, విద్యుత్ పొదుపులో మార్పు ముందుగా మన కార్యాలయాల నుంచే ప్రారంభం కావాలి.. అని ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు.

పొదుపులో ముందున్న వారికి ప్రశంసాపత్రాలు:

నీరు, విద్యుత్ పొదుపు చర్యలను సమర్థవంతంగా అమలు చేసి, నిర్దేశించిన 20 శాతం లక్ష్యాన్ని సాధించిన కార్యాలయాలను గుర్తించి ప్రోత్సహిస్తామని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ప్రతి నెలా నీరు, విద్యుత్ సంరక్షణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ప్రశంసాపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. పొదుపు చర్యల అమలులో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించి, ప్రతి జలమండలి కార్యాలయం ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు.

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ

గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు -- మంత్రి వాకిటి శ్రీహరి

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు.. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక..

క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి



తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం- మంత్రి వాకిటి శ్రీహరి

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు.

క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతోపాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా నిర్వహణ

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి వాకిటి

డిఫెన్స్ లిక్కర్ పట్టివేతవిలువ: 25 వేలు జెఫ్ Bydars??

కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు వెన్నెలగడ్డ చెరువు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా సుంకం చెల్లించని మద్యం (డిఫెన్స్ లిక్కర్) రవాణా చేస్తున్న వ్యక్తి శ్రీ ఇమ్మడి.నవీన్ ూ/శీ బొందయ్య, (33) హస్మత్పేట్, బోయిన్ పల్లి వద్ద (9) మద్యం సీసాలు ఒక్కొక్కటి 750ఎశ్రీ లభించాయి. అందులో (5) బ్లాక్ డాగ్ బాటిల్స్, (4) 100 పేపర్స్ బాటిల్స్ మొత్తం (6.750 లీటర్ల డిఫెన్స్ లిక్కర్)ఉన్నట్లుగా గుర్తించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ టి.లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. సదరు వ్యక్తినీ పూర్తిగా విచారించగా అతడు సైనికపురి దగ్గర ఒక డిఫెన్స్ ఉద్యోగి వద్ద కొని ఇక్కడ అమ్మడానికి తీసుకొనివచ్చి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడని ఈ సుంకం చెల్లించని డిఫెన్స్ లిక్కర్ విలువ సుమారుగా ? 25వేలు ఉంటుందని తెలిపారు. ఆ డిఫెన్స్ అధికారి కొరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఈ దాడులలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ పి.ఉమా మహేశ్వర్, సిబ్బంది గౌస్, కిషన్, రమేష్, శివ ప్రసాద్, సురేష్,విజయలక్ష్మి పాల్గొన్నారు. సిబ్బందిని అభినందించారు.

కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చాలా మిలిటరీ క్యాంటీన్ లు ఉన్నాయని తెలియక శుభకార్యాల కోసం ప్రజలు వారి వద్ద తక్కువ ధరకు కొని అమ్ముకోవడం, రవాణా చేయడం చట్టరీత్య నేరమని తెలియజేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మద్యం కలిగి ఉన్నా రవాణా చేసినా ఇతరులకు అమ్మినా చట్ట పరంగా శిక్షింపబడతారని తెలుపుతూ వెంటనే సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్

హైదరాబాద్ । అక్టోబర్ 23, జన తెలంగాణ

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే ూ+ప్రాణజూ లక్ష్యం.

గుల్షన్ కాలనీ, పీజేఆర్ నగర్, రాజీవ్‌నగర్ వడ్డెర బస్తీ ప్రాంతాల వినియోగదారులకు ఊరట

వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు ూ+ప్రాణజూ చేపట్టిన 11 కేవీ ఓవర్‌లోడెడ్ ఫీడర్ల విభజన కార్యక్రమంలో భాగంగా, సైబర్‌సిటీ ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ జూజు× సబ్‌స్టేషన్ నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ గుల్షన్ కాలనీ ఫీడర్‌ను ఎస్ఈ ఆపరేషన్ సైబర్‌సిటీ టి. చంద్రశేఖర్ శుక్రవారం చార్జ్ చేశారు.

33/11 కేవీ ూజ్ఞు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా పొందుతున్న 11 కేవీ రాజీవ్‌నగర్ ఓవర్‌లోడెడ్ ఫీడర్‌ను విభజించే పనుల్లో భాగంగా ఈ నూతన ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. ఫీడర్‌పై పెరుగుతున్న విద్యుత్ భారాన్ని తగ్గించి, ఆయా ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ పనుల ప్రధాన ఉద్దేశం.

ఈ ఫీడర్ విభజనతో గుల్షన్ కాలనీ, పీజేఆర్ నగర్, రాజీవ్‌నగర్ వడ్డెర బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుంది. ఫీడర్లపై అధిక భారం తగ్గడం ద్వారా లో-వోల్టేజ్ సమస్యలు, తరచూ ఏర్పడే విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు దోహదపడనుంది.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు, ఓవర్‌లోడెడ్ ఫీడర్లను గుర్తించి వాటి విభజన, పంపిణీ వ్యవస్థ బలోపేతం వంటి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ూ+ప్రాణ–జూ సీఎండీ శ్రీ జితేశ్ వి. పాటిల్, ఐఏఎస్ అధికారులకు సూచించారు. ఈ దిశగా సంస్థ క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపడుతోంది.

ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ సైబర్‌సిటీ టి. చంద్రశేఖర్, డీఈ ఆపరేషన్ కొండాపూర్ ఆర్. శ్యామ్ కుమార్, ఏడీఈ ఆపరేషన్ కొండాపూర్ సీహెచ్. కమలాకర్ రెడ్డి, ఏడీఈ కన్‌స్ట్రక్షన్ సైబర్‌సిటీ ఏ. లక్ష్మయ్య, ఏఈ ఆపరేషన్ వైట్‌ఫీల్డ్ యు. కిషోర్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

ముఖ్యమంత్రి,మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆలయ యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి నిదర్శనం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నిధులు మంజూరు కావటంతో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం



హైదరాబాద్: అక్టోబర్ 23 జన తెలంగాణ

పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు.

ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా "వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి, ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు.

ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధి నిధులు విడుదల కావటంలో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గామాత నవరాత్రి వేడుక



పార్సిగుట్టా,సంజీవపురం, చెందిన జై భారత్ సేవా సమాజ్, ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి వేడుకలో భాగంగా,ఆర్గనైజర్ శైలేందర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మా అమ్మ వారి మండపమున బతుకమ్మ కోలాటం మరియు అన్నదానం ఘనంగా నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రియ రమేష్, కుమార్, బిచ్చు, రామ్ కిషన్, బాబా, సంజయ్, రాఘవ్, రాజు, సాయి, శ్రీశైలం, వినోద్, హరీష్, నరేందర్‌లి మరియు టీమ్ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

●ఉద్యోగులకు భద్రత కల్పించాలి: ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర కోశాధికారి నరేష్ డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 78 ఉద్యోగ విభాగాల్లో పనిచేస్తున్న 17 వేల మందికి పైగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గత 11 రోజులుగా కలెక్టరేట్‌ల ఎదుట నిరసన ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, దీర్ఘకాలంగా ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఉద్యోగుల సేవలను గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఇవే..జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలాంటి షరతులు, పరీక్షలు లేకుండా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం సేవా ప్రయోజనాలు కల్పించాలని, బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న



బిల్లులను వెంటనే చెల్లించడంతోపాటు, ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగులకు ఏటా ఐదు శాతం వేతన పెంపు, ఎనిమిది శాతం విధేయత ప్రోత్సాహకాన్ని కల్పించాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఉద్యోగ విభాగాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులతోపాటు వర్తించే ఇతర సెలవుల ప్రయోజనాలు కల్పించాలని కోరారు. పదవీ విరమణ సమయంలో లేదా అనుకోని పరిస్థితుల్లో ఉద్యోగులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని, నిబంధనల ప్రకారం పింఛను, ముగింపు ప్రయోజనాలు తదితర సౌకర్యాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

25 ఏళ్ల సేవలకు గుర్తింపు ఇవ్వాలి

దాదాపు 25 ఏళ్లుగా ప్రజలకు నిరంతర వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, వారితో చర్చలు జరిపి న్యాయమైన పరిష్కారం చూపాలని నాయకులు కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగులకు కల్పిస్తున్న సేవా ప్రయోజనాలను పరిశీలించి, తెలంగాణలోనూ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ధర్నాలో 300 మందికి పైగా



పాల్గొనడం

ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల రాజేంద్రప్రసాద్, డాక్టర్ అభినందన్‌రెడ్డి, విజయచంద్రమౌళి, సంతోష్, డాక్టర్ మల్లేశం, డాక్టర్ సంయుక్త, డాక్టర్ రేణుక, డాక్టర్ కవిత, నర్సింగ్ సిబ్బంది, ఆయాలు సరిత, ప్రమీల, సహాయక నర్సులు, మంత్రసానులు జ్యోతి, లావణ్య, సరిత, సంధ్య తదితర నాయకులు పాల్గొన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సహాయక నర్సులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు సహా సుమారు 300 మందికి పైగా ఉద్యోగులు ధర్నాలో పాల్గొని తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

దేవత్ పల్లి వాసి వైద్యానికి రూ.2.50 లక్షల సీఎం సహాయనిధి

బాధితుడికి అండగా నిలిచిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది.నాంపల్లి మండలం దేవతపల్లి గ్రామానికి చెందిన కొత్తగొల్ల వెంకటయ్య తండ్రి నర్సింహా ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్నారు.మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు చొరవ తీసుకున్నారు.వెంకటయ్యకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ.2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన ఎల్ఓసీ మంజూరయ్యేలా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు కృషి చేశారు.ఈ ఆర్థిక సహాయం ద్వారా బాధితుడికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తోడ్పాటు లభించనుంది. అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో వైద్య ఖర్చుల భారం కుటుంబంపై పడకుండా ప్రభుత్వ సహాయనిధి ద్వారా అండ లభించడం బాధిత కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చే విషయం.

ప్రజల ఆరోగ్యం సంక్షేమం పట్ల ప్రజాప్రతినిధులు చూపుతున్న చొరవకు ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలుస్తోంది.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వెంకటయ్య త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని దేవత్ పల్లి గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన



VEMULA SRINIVASULU,
LLM., MBA.,
O.S.D. TO CHIEF MINISTER
GOVERNMENT OF TELANGANA

Room No.3, 6th Floor,
Dr.B.R.Ambedkar Telangana
Secretariat Hyderabad
Ph.No. 040-23450466
Fax No. 040-23459944

CHIEF MINISTER'S OFFICE

Lr. No.14677/CMRF-LOC/2026, Dated:23-10-2026

To
The Director,
M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir,

Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SRI RAJ GOPAL REDDY KOMATIREDDY, MLA - MUNUGODE, dt.:22-10-2026

@@@

The Hon'ble Chief Minister desires that the treatment of Kothagolli Venkataiah, S/O NARSIMHA, DEVATHPALLI, NALGONDA be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs. 2,50,000/- (Rupees Two Lakh Fifty Thousand Only) to undergo CRESCENTRIC GLOMERUNEPHRITIS HEMOTHORAX DECORTICATION

Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely,

(Vemula Srinivasulu)

Copy to:
SRI RAJ GOPAL REDDY KOMATIREDDY,
MLA - MUNUGODE
Copy to:
Kothagolli Venkataiah
S/O NARSIMHA
DEVATHPALLI, NALGONDA

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

●సల్పురం గ్రామపంచాయతీ ప్రజలకు కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ సూచన

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సల్పురం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ సూచించారు. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా వీరమల్ల రవిగౌడ్ మాట్లాడుతూ రైతులు పంటల సాగు విషయంలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.వర్షపాతం ఉష్ణోగ్రతల్లో మార్పులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు సలహాలను పాటిస్తూ



పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు.పంటల ఎంపిక విత్తనాల వినియోగం సాగు విధానాల విషయంలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.గ్రామ ప్రజలు వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని వీరమల్ల రవిగౌడ్ కోరారు.రైతులు అనవసర ఆందోళనలకు గురికాకుండా శాస్త్రీయ పద్ధతులు మరియు నిపుణుల సలహాల ఆధారంగా వ్యవసాయ పనులు చేపట్టాలని సూచించారు.

రైతుల సంక్షేమం పంటల రక్షణకు ముందస్తు అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొంటూ సల్పురం గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు ప్రజలు వాతావరణ పరిస్థితులను బట్టి తగిన జాగ్రత్తలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ విజ్ఞప్తి చేశారు.

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తి

●డిండి ఆయకట్టు పంటలను కాపాడేందుకు కల్వకుర్తి నీటిని తక్షణమే విడుదల చేయాలి

●పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరిన ఎమ్మెల్యే

తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావంతో డిండి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు వెంటనే నీటిని విడుదల చేసి, పంటలు ఎండిపోకుండా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

లిఎండుతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు

వర్షాభావ పరిస్థితుల కారణంగా డిండి ప్రాజెక్టు పరిధిలో నీటి కొరత తీవ్రంగా ఉందని, దీంతో ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే పంటలపై వర్షాభావ ప్రభావం పడుతున్న నేపథ్యంలో ఆలస్యం జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు

అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి



రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి పంట నష్టాన్ని నివారించేందుకు అత్యవసర ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకుని, డిండి ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు

జిల్లాలో రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలి,శిక్షణ కార్యక్రమంలో ఏసీ అనిల్ కుమార్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు చీఫ్ కమీషనర్ అఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, హైదరాబాద్ గారి ఆదేశాల మేరకు, జిల్లాలో భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూముల సరిహద్దులను నిర్ధారించడం, రీ-సర్వే ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రీసర్వే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ , మరియు జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్ శిక్షకులుగా వ్యవహరించి, పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి రీ-సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే నిర్వహణ విధానం, క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన, భూముల సరిహద్దుల గుర్తింపు, ల్యాండ్ పార్సెల్ మాడ్యూల్స్ తయారీ, సర్వే వివరాల సేకరణ, సంబంధిత రెవెన్యూ రికార్డులతో వివరాల సరిపోలిక, ఆన్‌లైన్‌లో డేటా నమోదు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

అదేవిధంగా రీ-సర్వే ప్రక్రియలో రెవెన్యూ



మరియు సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయడం, భూ వివరాల్లో ఖచ్చితత్వాన్ని నిర్ధారించడం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించడం, రైతులకు సంబంధించిన భూ వివరాలను జాగ్రత్తగా పరిశీలించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ప్రతి మండలంలో ఏర్పాటు చేసిన రీ-సర్వే బృందాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ, రీ-సర్వే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల అమలులో ఎదురయ్యే



సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో రీ-సర్వే పనులను సమర్థవంతంగా అమలు చేసి, భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడంతో పాటు రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే ముఖ్య లక్ష్యం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, అలాగే ప్రతి మండలానికి ఏర్పాటు చేసిన రీ-సర్వే బృందాల సభ్యులు పాల్గొన్నారు.

జనసముద్రం జిల్లా రిపోర్టర్
మెంగు సతీష్

జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపునకు మద్దతుగా నిలుస్తాం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

● -డంపింగ్ యార్డు ఎత్తివేతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని జేఏసీ వినతి.హైదరాబాద్ పరిసరాల్లో 6 నుంచి 10 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్



జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డు తొలగింపు కోసం జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత జేఏసీ పోరాట కమిటీ నాయకులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం, అక్టోబర్ 23న ఎమ్మెల్యేను కలిసిన జేఏసీ ప్రతినిధులు.. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చట్టసభల్లో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల సహకారం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా జేఏసీ పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి మాట్లాడుతూ.. గతంలో ఆటోనగర్ డంపింగ్ యార్డు సమస్యపై పోరాటం చేసిన నేతగా సుధీర్ రెడ్డికి గుర్తింపు ఉందని తెలిపారు. ప్రస్తుతం మన్సూరాబాద్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన సమస్యపై కూడా ఆయన 20 కాలనీల్లో పర్యటించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా భూగర్భ జలాలు, గాలి, నీరు కలుషితమై మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని షేక్ షావలి ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలపక్షంలో భాగంగా సుధీర్ రెడ్డి సైతం ఈ సమస్య తీవ్రతను గుర్తించి ప్రస్తావించారని తెలిపారు. డంపింగ్ యార్డు తొలగింపునకు నిర్దిష్ట గడువు ప్రకటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని కోరినట్లు వెల్లడించారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపు పోరాటానికి మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడి చెత్తను అక్కడే నిర్వహించే విధంగా 6 నుంచి 10 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు సీపీఎం శివన్నారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వి. ప్రవీణ్, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి చెందిన మహ్మద్ పాషామియా, టీవీఆర్ఎస్ మోనార్ దుర్గాప్రసాద్,చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, జర్నలిస్ట్ కొన్నె వేణు, టీయూసీఐ జి.లింగం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి లక్కీకి శుభాకాంక్షలు తెలిపిన సతీష్ కుమార్

లక్కీ భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలి: ప్రముఖుల ఆకాంక్ష

తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ చిన్న కుమార్తె హింగే లక్కీ జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ నివాసంలో చిన్నారి లక్కీని శాలువాతో సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలంగాణ



ఫర్టిలైజర్ అండ్ సీడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్ జి., తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్



రావు తదితరులు లక్కీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.చిన్నారి లక్కీ జీవితంలో మరెన్నో పుట్టినరోజులను ఆనందంగా జరుపుకోవాలని, చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రముఖులు ఆకాంక్షించారు.

RN NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 24, 2026

ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో - యాసంగిలో ఆరుతడి పంటల సాగు

•భూసార సంరక్షణ కార్యక్రమాలు

•ఖేత్ బచావో..అభియాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పెద్దవంగర మండలం, అవుతాపురం రైతు వేదికలో ఖేత్ బచావో..అభియాన్ కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల్లో బోర్లు, బావులు కింద నిత్య ఆదాయం ఇచ్చే మార్కెట్ డిమాండ్ ఉన్న ఆరుతడి పంటలు అయిన ఆయిల్ పామ్, కోకో, వక్క, జాజికాయ, మిరియాలు, కొబ్బరి, కూరగాయలు, ఉల్లి, పండ్ల తోటలు, పూలు, మల్బరీ, మునగ, మొదలైన ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వాంకుడోతు చిలుకమ్మ, సోంల, బానోతు శ్రీనివాస్, క్షేత్రాలను సందర్శించి వారు సాగు చేస్తున్న కూరగాయలు, పుచ్చ, కర్బూజ, బొప్పాయి సాగు గురించి అడిగారు. బిందు సేద్యం, మల్చింగ్ మొదలైన రాయితీలు ఉపయోగించుకొని సాగు చేస్తున్నామని వివరించారు. వారు కూరగాయలు, పుచ్చ, కర్బూజ, బొప్పాయి పంటల సాగుతో స్వల్ప కాలంలోనే ఎకరానికి ఖర్చులు పోను రెండు లక్షల ఆదాయం పొందుతున్నామని వివరించారు. ఖమ్మం జిల్లాలో రైతులనుండి వీటి సాగు తెలుసుకొని గత పది సంవత్సరాల నుండి పత్తి, మిరప, వరికి బదులుగా ఆరు తడి పంటలైన కూరగాయలు, పుచ్చ, కర్బూజ, బొప్పాయి సాగు చేస్తున్నామని తెలిపారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా "పంట మార్పిడి" చేసి ప్రతీ మండలంలో అన్ని రకాల కూరగాయలు, ఆయిల్ పామ్, పండ్ల తోటలు, పూల తోటలు, మల్బరీ, చిరు ధాన్యాలు, అపరాలు, నూనె గింజలు వంటి పలు పంటలతో పాటు నూతన పంటలైన ఔషధ మరియు సుగంధ తైల పంటలు, కొబ్బరి, కోకో, అవకాడో పంటల సాగుతో అధిక ఆదాయంఇచ్చే, అవసరానికి తగ్గట్టుగా పంటలు సాగు చేయాలని అన్నారు.

పంట మార్పిడి నీ పాటించాలి ప్రతి గ్రామంలో బోర్లు బావులు కింద 50 ఎకరాలలో ఆదాయం ఇచ్చే మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, కూరగాయలు పండ్లు పూలు, మల్బరీ, ఉల్లి, నూనె గింజలు, చిరుధాన్యాలుమొదలైనవి సాగు చేయాలి.

ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో పశువుల సంరక్షణపై కలెక్టర్ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

పశువులకు ఎల్లప్పుడూ శుభ్రమైన నిల్వ చేసుకోవాలని



అన్నారు.

వేడి ఒత్తిడి లక్షణాలు కనిపించినప్పుడు పశువులను చల్లటి నీడలో ఉంచి, వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు పశు గ్రాస విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా గ్రామీనాభివృద్ధి అధికారి మధుసూదన రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, జిల్లా పట్టు పరిశ్రమ, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, కూరగాయల రైతులు కోమరబోయిన ఎల్లయ్య, కోడిశెట్టి శ్రీనివాస్, బోయిన ఉప్పలయ్య, వాంకుడోతు చిలుకమ్మ , తదితరులు పాల్గొన్నారు.

జన సముద్రం జిల్లా రిపోర్టర్
మెంగు సతీష్

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి,

•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,



జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలంలోని భీమారం, బూరుగుపల్లి, గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యా కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ పనులు, పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రం, పంట కుంటలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులు, గ్రామ పంచాయతీ రికార్డులు, ఇంకుడు గుంతలు, సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. భీమారం గ్రామంలో చేపట్టిన పంట కుంట పనులను పరిశీలించి, వ్యవసాయ అవసరాలకు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

భూరుగుపల్లి గ్రామ పంచాయతీలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవడం ఎంతో అవసరమని, నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో చేపట్టి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను సక్రమంగా, ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, పనుల పురోగతి, రికార్డుల నిర్వహణలో పూర్తి జవాబుదారీతనంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని



ఇంకుడు గుంతలను పరిశీలించి, నిర్వహణ తీరును సమీక్షించారు. గ్రామాలలో మురుగునీటి నిర్వహణ సక్రమంగా ఉండేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, త్రాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, వసతి గృహంలో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సతీష్, ఏపీఓ, భీమారం సర్పంచ్ ఉష్క మల్ల విజయలక్ష్మి-పున్నం చంద్, , పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి,

•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,



జిల్లాలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి మండల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా ఆరుతడి పంటల సాగుపై రైతులకు వివరించాలని, నవంబర్ 30వ తేదీ వరకు జిల్లాలోని రైతు వేదికలలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రైతులు ఈ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మండలాల వారీగా పంటల వైవిధ్యీకరణ ప్రణాళికలను రూపొందించి, గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర, వరి సన్న ధాన్యం కొనుగోళ్లు, పత్తి పంట కోతలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.



ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతో పాటు కూరగాయల విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కడెం ప్రాజెక్టు నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని, యాసంగిలో విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గుల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి పొదుపు సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల వారీగా తక్కువ నీటితో విజయవంతంగా పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారు అనుసరిస్తున్న పద్ధతులను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. విజయవంతమైన సాగు విధానాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా జిల్లాలో నీటి పొదుపు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిజమైన అర్హులైన పేద కుటుంబాలకే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి

•లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి -- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి నియోజకవర్గంలోని గృహ నిర్మాణ సమస్యలను పరిష్కరించి, అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ ఐఏఎస్‌ను ఇతర ఎమ్మెల్యేలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే కౌకూరులో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి త్వరితగతిన భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజీవ్ గృహకల్ప, వాంబే ఇళ్లకు తాగునీటి సౌకర్యం

కౌకూరులోని రాజీవ్ గృహకల్ప, వాంబే గృహ సముదాయాల నివాసితులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన నీటి నిల్వ ట్యాంకులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి నివాసితులకు నిరంతర తాగునీటి సరఫరా అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు.అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి మండలంలో దేవాలయాలే లక్ష్యంగా చోరీలు!

పూజా గంటలు, నిత్య పూజా సామగ్రి అపహరణ.. నిందితుల ఆచూకీ ఏదీ?

ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారిపై నిఘా పెట్టాలంటున్న స్థానికులు.

పోలీసుల గస్తీ పెంచాలని విజ్ఞప్తి



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో దేవాలయాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న చోరీ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి.మండల కేంద్రంలోని ఓ దేవాలయంతో పాటు సూరారం గ్రామంలోని గుడిబండపల్లె, వల్లభాపూర్, కోతులనడుమ దేవాలయంలోనూ గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది.రాత్రి వేళల్లో దేవాలయాల్లోకి ప్రవేశించిన దుండగులు పూజా గంటలు, నిత్య పూజలకు ఉపయోగించే సామగ్రిని అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.దేవాలయాల్లో ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో నిర్వహించే నిత్య పూజలకు అవసరమైన సామగ్రి చోరీకి గురవుతుండటంతో భక్తులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయాల్లోకి చొరబడి పూజా సామగ్రిని అపహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా ఆలయాల భద్రతకు పటిష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గతంలోనూ పలు ఆలయాల్లో చోరీలు

ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని పలు దేవాలయాల్లో గతంలోనూ చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఆలయాల్లో తరచూ చోరీలు జరుగుతున్నప్పటికీ నిందితులను గుర్తించి, ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయడంలో మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.దేవాలయాల్లోని గంటలు, పూజా సామగ్రి వంటి వస్తువులు సైతం భద్రంగా లేని పరిస్థితి నెలకొంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఎలా ఉంటుందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో సరైన నిఘా లేకపోవడం, ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు కొరవడటం చోరీలకు అవకాశమిస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రానైట్ కంపెనీలు, జాతీయ రహదారి ప్రాంతాల్లో నిఘా పెంచాలి

ఎల్కతుర్తి మండల పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ కంపెనీలు, జాతీయ రహదారి ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నారు.మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారి వివరాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, చట్టబద్ధమైన పరిధిలో తగిన నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.బయటి ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారిలో ఎవరైనా చోరీలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు కొందరు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నప్పటికీ, తాజా ఘటనల్లో నిందితులు ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదు. కేవలం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసిస్తున్నారనే కారణంతో ఎవరినీ అనుమానితులుగా చూడకుండా, ఆధారాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.గ్రానైట్ కంపెనీల పరిసర ప్రాంతాలు, జాతీయ రహదారి వెంబడి ఉన్న నివాస ప్రాంతాలు, అద్దె ఇళ్ల వివరాలపై సంబంధిత అధికారులు సమన్వయంతో దృష్టి సారించాలని కోరుతున్నారు.అనుమానాస్పద కదలికలు కనిపించినప్పుడు ప్రజలు పోలీసులకు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

పోలీసుల గస్తీ పెంచాలని విజ్ఞప్తి

మండలంలో వరుసగా జరుగుతున్న దేవాలయ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.గతంలో జరిగిన చోరీ ఘటనల వివరాలను పరిశీలించి, ప్రస్తుత ఘటనలతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచడంతో పాటు, దేవాలయాలు, ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో నిఘా బలోపేతం చేయాలని కోరుతున్నారు.అలాగే దేవాలయాల నిర్వాహకులు అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు విలువైన పూజా సామగ్రిని భద్రపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు, ఆలయ కమిటీలు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే ఇటువంటి ఘటనలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవాలయాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, చోరీ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని ఎల్కతుర్తి మండల ప్రజలు కోరుతున్నారు. తాజా ఘటనలకు సంబంధించి పోలీసుల అధికారిక ప్రకటన, పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీకి నూతన నియామకాలు



మేడ్చల్--మల్కాజిగిరి: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీకి నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా చైర్మన్‌గా ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్ను నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ శ్రీ వరుణ్ తేజ ముదిరాజ్ నియమించి, ఐడీ కార్డును అందజేశారు. అదేవిధంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా బాలబోయిన సోమయ్య ముదిరాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మచ్చ ఉదయ్ కుమార్ గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా దుంపల చంద్రశేఖర్ ముదిరాజ్లను నియమిస్తూ వారికి ఐడీ కార్డులను అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తూ, ప్రజలకు న్యాయం అందేలా కృషి చేయాలని ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీ సభ్యులకు సూచించారు.



RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 24, 2026

“ఇడుపు కాయితం” సినిమా కథ, మాటలు, నేపథ్యంలోని సహజత్వమే మా అందరినీ బాగా ఆకట్టుకుంది - ‘గడప..’ సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ బన్నీ వాస్

డిసెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ

జన తెలంగాణ సినిమా

ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా “ఇడుపు కాయితం”. ఈ సినిమాలో ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్ గా నటిస్తోంది. ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా “ఇడుపు కాయితం” సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు “ఇడుపు కాయితం” సినిమా నుంచి ‘గడప..’ సాంగ్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

లిరిసిస్ట్ అలరాజు మాట్లాడుతూ - నేను చిత్ర పరిశ్రమలో ఇప్పటిదాకా వంద పాటలకు సాహిత్యం అందించాను. ఆ వంద పాటలు ఒకెత్తు ఈ సినిమాలో శ్రీలత సాంగ్ మరో ఎత్తు. అంత గుర్తింపు నాకు తీసుకొచ్చిందా పాట. ఈ అవకాశం కల్పించిన మా దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. అన్నారు.

లిరిసిస్ట్ అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ - ఈ సినిమా గడప సాంగ్ రాసే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. ఇలాంటి సందర్భం అన్ని సినిమాల్లో ఉండదు. గడప అనేది మన వారసత్వానికి చిరుమానా లాంటిది. ఈ పాటను సురేష్ బొబ్బిలి ఎంతో అందంగా కంపోజ్ చేశారు. అన్నారు.

సింగర్ తేలు విజయ మాట్లాడుతూ - నేను వేల ఫోక్ సాంగ్స్ పాడాను. ఊళ్లలో పెళ్లిల్లలో కూడా పాటలు పాడాను. కానీ నాకు ఈ పాట మంచి గుర్తింపు తీసుకొస్తోంది. ఈ పాట నేను పాడితే బాగుంటుందని తమ్ముడు సురేష్ బొబ్బిలి అవకాశం ఇచ్చాడు. ఈ పాటలో లిరిక్స్ నాకు చాలా బాగా నచ్చాయి. అన్నారు.

సింగర్ శంకర్ బాబు మాట్లాడుతూ - ఈ సినిమాలో శ్రీలత సాంగ్ పాడాను. పుష్పలో సాంగ్ పాడిన తర్వాత మళ్లీ ఒక మంచి సాంగ్ పాడే అవకాశం వస్తే బాగుండేది అనుకున్నాను. అదే టైమ్ లో సురేష్ బొబ్బిలి పిలిచి శ్రీలత సాంగ్ పాడే అవకాశం ఇచ్చారు. అన్నారు.

యాక్టర్ మైమ్ మధు మాట్లాడుతూ - ఈ చిత్రంలో



హీరోయిన్ తండ్రి పాత్రలో నటించాను. ఈ సినిమా కోసం పనిచేసిన టెక్నీషియన్స్ సినిమా సెట్ ను ఎంతో సహజంగా తీర్చిదిద్దారు. ఆ వాతావరణంలోకి వెళ్లగానే నిజంగా ఆ కథ జరిగే ప్రాంతానికి వెళ్లిన ఫీల్ కలిగింది. అలాగే మా డైరెక్టర్ రాసుకున్న బ్యూటిఫుల్ స్క్రిప్ట్ నటులుగా మమ్మల్ని తట్టిలేపింది. ఇలాంటి చిత్రంలో నటించే అవకాశం అరుదుగా వస్తుంటుంది. అన్నారు.

యాక్టర్ వినోద్ బాల మాట్లాడుతూ - నేను ఇటీవల కొంతకాలంగా నటనకు విరామం ఇచ్చాను. దర్శకుడు వంశీరెడ్డి వచ్చి ఈ కథలో ముఖ్యమైన పాత్ర మీదేనని చెప్పి ఒప్పించాడు. ఈ చిత్రంలో హీరో తండ్రి పాత్రలో నటించాను. షూటింగ్ టైమ్ లో తెలంగాణ మట్టి వాసన, ఆ మంచి వాతావరణాన్ని మా టీమ్ అంతా ఫీల్ అయ్యాం. అన్నారు.

యాక్టర్ అభినవ్ గోమటం మాట్లాడుతూ - ఈ సినిమా తెలంగాణ నేపథ్యంగా సాగే మంచి కుటుంబ కథా చిత్రం. ఇందులోని శ్రీలత సాంగ్ నాకు చాలా ఇష్టం. నేను బీట్ ఓరియెంటెడ్ సాంగ్స్ వింటుంటా కానీ ఈ చిత్రంలోని సాంగ్స్ లిరికల్ గా కూడా ఆకట్టుకున్నాయి. ప్రియదర్శి మంచి స్క్రిప్ట్స్ ఎంచుకుంటారు. ఆయన బలగం, కోర్ట్ చిత్రాల్లా ఈ సినిమా కూడా మంచి విజయం సాధిస్తుంది. అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ - “ఇడుపు కాయితం” అనే గొప్ప సినిమాకు వర్క్ చేసే అవకాశం కల్పించిన మా దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. శ్రీలత సాంగ్ కు అలరాజు ఎంత మంచి లిరిక్స్ అందించారో ఈ గడప పాటకు అభినయ శ్రీనివాస్ అంతే మంచి లిరిక్స్ అందించారు. మా విజయ అక్క బాగా పాడారు. ఈ సినిమా సాంగ్స్, మ్యూజిక్ మీకు ఒక స్పెషల్ మెమొరీగా గుర్తిండిపోతాయి. అన్నారు.

డైరెక్టర్ వంశీరెడ్డి దొండపాటి మాట్లాడుతూ - మా ప్రొడక్షన్ హౌస్ సహకారంతో 31 రోజుల ఔట్ డోర్ షెడ్యూల్ సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేశాం. ప్యాషన్ ఉన్న యంగ్ టీమ్ అంతా మా మూవీకి హార్డ్ వర్క్ చేశారు. షూటింగ్ ఎలా జరుగుతోంది, సీన్స్ ఎలా వస్తున్నాయి అని బన్నీ వాస్ గారు రోజూ అడిగి తెలుసుకునేవారు. సినిమా కోసం ఏది కావాలన్నా మా ప్రొడ్యూసర్స్ మీ ఇష్టం అనేవారు. అంత సహకారం అందించారు. ఈ వేదిక మీద తెలంగాణ కళాకారులను అందరినీ చూస్తుంటే ఎమోషనల్ అవుతున్నా. మా అందరిలో సహజంగానే తెలియని ఉద్వేగం ఉంటుంది. మా కళాకారులను ఈ వేదిక మీద చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి. మా మూవీ టైటిల్ గురించి కూడా చాలా వివాదాలు వచ్చాయి. అయినా ఏ రోజూ మా ప్రొడ్యూసర్స్ ఈ సినిమా కోసం ఎవరినీ తీసుకున్నా నన్ను ప్రశ్నించలేదు. అన్నారు.

హీరోయిన్ నాగదుర్గ మాట్లాడుతూ - “ఇడుపు కాయితం” సినిమాకు వర్క్ చేస్తున్న క్రమంలో ఇది నాకొక ముఖ్యమైన రోజు అనుకుంటున్నా. గడప సాంగ్ మీ అందరికీ కనెక్ట్ అయ్యిందని నమ్ముతున్నాను. ఇంట్లో ఏ పనిచేసినా అమ్మ నీకు పెళ్లై అత్తవారింటికి వెళ్తే తెలుస్తుంది అనేది ఆ మాట ఈ సినిమాలో శ్రీలత పాత్రలో నటిస్తున్నప్పుడు గుర్తొచ్చేది. గడప సాంగ్ ప్రోమో రిలీజ్ కాగానే మా నాన్న ఫోన్ చేసి బాగా నటించావు అని కన్నీళ్లు పెట్టుకున్నారు. నాగదుర్గ నుంచి శ్రీలతగా మారేందుకు చాలా కష్టపడ్డాను. ఆ కష్టాన్ని మీరు ఆదరిస్తారని నమ్ముతున్నాను. శ్రీలత అంటే మా ఇంటి అమ్మాయి మీ ఇంటి అమ్మాయి అందరి ఇళ్లలో ఉండే అమ్మాయి. ప్రాంతీయ బేధం లేకుండా నా పాత్రను మీరంతా ఇష్టపడతారు.

హీరో ప్రియదర్శి మాట్లాడుతూ - “ఇడుపు కాయితం” సినిమా పూజా కార్యక్రమాలు చేసి వచ్చినప్పుడు సోషల్ మీడియాలో నెగిటివ్ గా చాలా మంది స్పందించారు. ఈ సినిమాకు సబ్ టైటిల్స్ వేస్తారా, తెలుగులో డబ్ చేస్తారా అని కామెంట్స్ చేశారు. ఆ టైమ్ లో మేము తప్పు చేస్తున్నామా అని అనిపించింది. ఈ నెగిటివిటీ చూసి బాధకు లోనయ్యాం. కానీ మీడియా నుంచి ఇండస్ట్రీ నుంచి చాలా మంది మమ్మల్ని సపోర్ట్ చేస్తూ ముందుకొచ్చారు. వారి సపోర్ట్ తో నెగిటివ్ ను పాజిటివ్ చేసుకోవచ్చు అనే నమ్మకం కలిగింది. ఆ నమ్మకంతోనే ఈరోజు మీ అందరినీ మా గడప లోకి ఆహ్వానిస్తున్నాం. మా అమ్మ తన ఇంటి గడప దాటి మా ఇంటికి వచ్చింది, అలాగే నా సోదరి, నా భార్య..ఇలా మన ఇంటిలో గడప గురించి చాలా జ్ఞాపకాలు ఉంటాయి. అలాంటి గడపను సెలబ్రేట్ చేసే పాట ఉంది. మీరు నేటివిటీ గురించి ఆలోచించినా మావైపు ఒకసారి చూడండి. ఈ పాట వినండి. మీ ఆ ప్రేమను ఫీల్ అవుతారు. డిసెంబర్ 11న మా సినిమాను రిలీజ్ చేస్తున్నాం. ఏ ప్రాంతమైనా భాషైనా మీకు మా సినిమా నచ్చుతుంది. సురేష్ బొబ్బిలి మ్యూజిక్ మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తుంది. అన్నారు.

ప్రొడ్యూసర్ బన్నీవాస్ మాట్లాడుతూ - ఈ రోజు నాకు ప్రత్యేకమైన రోజు. శ్రీలత సాంగ్ ను మీతో పాటు తెరపై చూశాను. ఆ పాటలో నా కూతురు కూడా ఉంది. తనను స్క్రీన్ మీద చూడటం ఇదే తొలిసారి. వినోద్ బాల పాత్రకు ప్రతి భర్త కనెక్ట్ అవుతాడు. వినోద్ బాల ప్రియదర్శికి తండ్రి పాత్రలో నటించాడు. ఆయన చెప్పే ఎక్సిపీరియన్స్ తో చెప్తున్నారా వెళ్లకు అనే డైలాగ్ ఫేమస్ అవుతుంది. నేను గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగాను. దర్శకుడు వంశీరెడ్డి ఈ కథ చెబుతున్నప్పుడు తెలంగాణ నేపథ్యం అనేది గుర్తుకురాలేదు. నాకు నా చిన్నప్పుడు చూసిన ఊరి, ఇంటి వాతావరణం కళ్లకు కట్టినట్లు కనిపించింది. కొత్తగా పెళ్లయిన ఇంట్లో ఏం జరుగుతుంది. ఒక నీటి పంపు దగ్గర ఏం జరుగుతుంది. ఇలా.. మన ఇంటి కథ చెప్పినట్లు అనిపించింది. కథ విన్న వింటనే ఇది సినిమా కథలా లేదు మన ఇంట్లో జరిగే కథలా ఉంది అని చెప్పాను. ఈ సినిమా కథ, మాటలు, నేపథ్యంలోని సహజత్వమే మా అందరినీ ఆకట్టుకుంది. సుకుమార్ గారు, తవిత గారి సపోర్ట్ లేకుంటే ఈ సినిమా ఇంత ఫాస్ట్ గా కంప్లీట్ అయ్యేది కాదు. నా కెరీర్ లోనే వేగంగా నిర్మించిన సినిమా ఇది. అది నా గొప్పదనం కాదు ఈ సినిమాకు వర్క్ చేసిన యంగ్ స్టర్స్ గొప్పదనం. కొత్తగా పెళ్లయ్యే ఏ అమ్మాయినైనా గడప సాంగ్ లోని లిరిక్స్ బాగా ఆకట్టుకుంటాయి. కొత్త జంటలు మీ అత్త మామను తీసుకుని డిసెంబర్ లో మా సినిమా చూసేందుకు రండి. థియేటర్ నుంచి బయటకు వెళ్లేప్పుడు వాళ్లు మీ భుజాలపై చేయి వేసి తీసుకెళ్తారు. మీ పెళ్లైన కొత్తలో మా “ఇడుపు కాయితం” సినిమా చూస్తే మీరు ఇంకెప్పుడు ఇడుపు కాయితం గురించి ఆలోచించరు. అన్నారు.

నటీనటులు - ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు

టెక్నికల్ టీమ్

కాస్ట్యూమ్ డిజైనర్ - అశ్వత్ భైరి
ఆర్ట్ డైరెక్టర్ - ఆశిష్ తేజ
ఎడిటర్ - శ్రీధర్ సొంపల్లి
డీవోపీ - ఎంఎన్ బాల్ రెడ్డి
మ్యూజిక్ - సురేష్ బొబ్బిలి
బ్యానర్స్ - సుకుమార్ రైటింగ్స్, బన్నీవాస్ వర్క్స్
ప్రొడ్యూసర్ - బన్నీవాస్
స్క్రిప్ట్, డైరెక్షన్ - వంశీరెడ్డి దొండపాటి
మార్కెటింగ్ - విష్ణు తేజ్ పుట్ట
పీఆర్ఓ - సురేష్ (ఎస్ కే మీడియా), మడూరి మధు

‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’ ట్రైలర్ విడుదల.. కామెడీ, యాక్షన్, సస్పెన్స్ మేళవింపుతో ఆకట్టుకుంటున్న ట్రైలర్!

‘ఆదర్శ కుటుంబం’ సినిమా మీ అందరికీ నచ్చుతుంది: విక్టరీ వెంకటేష్

మీరు ఊహించిన పద్ధతిలో కాకుండా వేరే కోణంలో ఉండే సినిమా ‘ఆదర్శ కుటుంబం’: మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్

జన తెలంగాణ సినిమా

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, నారాయణమ్మ, మాలా పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా నుంచి అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ విడుదలైంది.

గిలిగింతలు పెట్టే హాస్య సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన యాక్షన్, ఆసక్తికరమైన డ్రామాతో ఈ సినిమా ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకాన్ని ‘ఆదర్శ కుటుంబం’ ట్రైలర్ కలిగిస్తోంది.

త్రివిక్రమ్ రచన, దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా ట్రైలర్.. ఆయన బలమైన రచనను, విలక్షణమైన కథా శైలిని మరోసారి చూపిస్తోంది. కుటుంబ వినోదానికి యాక్షన్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ ఆసక్తిని పెంచుతోంది. కామెడీ, యాక్షన్, సస్పెన్స్‌లను చక్కగా మేళవించిన ట్రైలర్.. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా ఉండబోతోందనే అంచనాలను పెంచుతోంది.

విక్టరీ వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆయన చూపించిన ఎనర్జీ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఆయన నటనకు తోడు ఆసక్తికరమైన కథనం, వినోదభరిత సన్నివేశాలు ట్రైలర్‌ను మరింత ఆకట్టుకునేలా చేశాయి. ఇక తమన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు అదనపు బలాన్నిచ్చింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో తీవ్రతను పెంచుతూ, కథలోని ఉత్కంఠను మరింతగా ఎలివేట్ చేసింది.

‘ఆదర్శ కుటుంబం’ ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్ లోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. “మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మీ అద్భుతమైన స్పందన చూసి ఆనందంగా ఉంది. కాలేజ్ లైఫ్ లో నాకు ఎన్నో మెమోరీస్ ఉన్నాయి. ఈరోజులు మళ్ళీ రావు. మీరు కూడా మంచి మెమోరీస్ ఉండేలా చూసుకోండి. మీ కలను నిజం చేసుకోండి. కాలేజ్ అంటే డిగ్రీ, జాబ్ మాత్రమే కాదు.. మంచి క్యారెక్టర్ తో బయటకు రావాలి. అక్టోబర్ 30న మా సినిమా విడుదలవుతోంది. మీ అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను.” అన్నారు.

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. “ఈ సినిమా మీరు ఊహించిన పద్ధతిలో కాకుండా, వేరే డైరెక్షన్ లో ఉండే లాంటి అవకాశమున్న సినిమా ఇది. నార్మల్ రొమాంటిక్ కామెడీ కాకుండా వేరే వేరే అంశాలను కూడా డిస్కస్ చేయడం జరిగింది. క్రైమ్ కామెడీ లేదా బ్లాక్ కామెడీ అలాంటివి ట్రై చేశాము. నాకు, వెంకటేష్ గారికి కూడా ఇది ఫస్ట్ అటెంప్ట్. పని చేసేటప్పుడు ఈ సినిమా మా అందరికీ ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. మీక్కూడా నచ్చుతుందని ఆశిస్తున్నాను. అక్టోబర్ 30వ తారీఖున థియేటర్లలో కలుద్దాం. ఈ సినిమాలో పనిచేసిన అందరు టెక్నీషియన్లకు, నటీనటులకు, ముఖ్యంగా వెంకటేష్ గారికి కృతజ్ఞతలు. ప్రొడ్యూసర్ చినబాబు గారికి థ్యాంక్స్ చెప్పుకోవడమంటే ఫ్యామిలీకి థ్యాంక్స్ చెప్పుకోవడమే. ఆయన తరపున కూడా అందరికీ నేనే కృతజ్ఞతలు చెబుతున్నాను. అలాగే తమన్ అద్భుతమైన సంగీతం అందించాడు. ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఫెంటాస్టిక్ జాబ్ చేశాడు. దాదాపు 7-8 పాటలు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లో ఉంటాయి. త్వరలోనే రిలీజ్ చేయబోతున్నాం అవన్నీ. థ్యాంక్యూ. నమస్కారం.” అన్నారు.

కథానాయిక శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. “ఇలా స్టూడెంట్స్ మధ్యలో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. మనకి లైఫ్ లో ఎన్నో ప్లాన్స్ ఉంటాయి. కానీ, లైఫ్ ప్లాన్ మరోలా ఉంటుంది. మనల్ని సర్ప్రైజ్ చేస్తూనే ఉంటుంది. అలాగే మా సినిమాలో కూడా నెక్స్ట్ సీన్ ఏం జరుగుతుంది, ఏమవుతుంది అనే ఆసక్తి ఉంటుంది. ప్రతి సీన్ కి ఓ సర్ప్రైజ్ ఉంటుంది. మీరు మా సినిమా చూసి ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నాను. ఇంత మంచి సినిమాలో అవకాశమిచ్చి, ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకాలను ఇచ్చిన త్రివిక్రమ్ గారికి కృతజ్ఞతలు. వెంకటేష్ గారు లాంటి లెజెండ్ తో కలిసి నటించడం గౌరవంగా భావిస్తున్నాను. నిర్మాత చినబాబు గారు ఒక పిల్లర్ లాగా మా అందరికీ ఎంతో సపోర్ట్ గా నిలిచారు. తమన్ గారు



అద్భుతమైన సంగీతం అందించారు. మీ అందరి లాగే నేను కూడా అక్టోబర్ 30 కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాను.” అన్నారు.

సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. “ఆదర్శ కుటుంబం నాకు ప్రత్యేకమైన సినిమా. నా ఫేవరెట్ ఫిల్మ్ నువ్వు నాకు నచ్చావ్. ఎప్పుడు చూసినా ప్రతి సీన్ ఎంజాయ్ చేస్తాను. ఆ కాంబినేషన్ కోసం నేను ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. కొందరు రాస్తే కొందరు మాట్లాడాలి, కొందరు యాక్ట్ చేయాలి అనిపిస్తుంది. జూనియర్ ఎన్టీఆర్, త్రివిక్రమ్ గారి కాంబినేషన్ చూడాలనే కోరిక అరవింద సమేత సినిమాతో తీరిపోయింది. అలాగే త్రివిక్రమ్ వెంకటేష్ గారి కాంబో. త్రివిక్రమ్ గారు పెర్ఫెక్ట్ ఫ్యామిలీ మ్యాన్. ఫ్యామిలీకి ఏం కావాలో ఆయనకు కరెక్ట్ గా తెలుసు. వెంకటేష్ గారి కోసం ఆయన అద్భుతమైన స్క్రిప్ట్ రాశారు. ఇటీవల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పూర్తి చేశాను. సినిమా ఫెంటాస్టిక్ గా ఉంది. చాలా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుంది. నిర్మాత చినబాబు అరవింద సమేత నుంచి నన్ను ఎంతో సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. ఇది త్రివిక్రమ్ గారి ట్రేడ్ మార్క్ ఫిల్మ్. మీ అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది.” అన్నారు.బాల నటుడు రాజ్ ప్రజ్వల్, యువినా కూడా ఈ ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో పాల్గొని సినిమా ఘన విజయం సాధించాలని ఆకాక్షించారు. తమదైన మాటలతో విద్యార్థులలో ఉత్సాహం నింపారు.20 ఏళ్ల తర్వాత విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో సినిమా వస్తుండటంతో ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’పై ఆసక్తి నెలకొంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్లోనూ మంచి క్రేజ్ ఉన్న ఈ కలయిక.. మరోసారి నవ్వులు, భావోద్వేగాలు, యాక్షన్, ఉత్కంఠతో కూడిన పూర్తిస్థాయి వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

అద్భుతమైన ట్రైలర్ తో ‘ఆదర్శ కుటుంబం -- హౌస్ నెం. 47’పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. క్రైమ్ థ్రిల్లర్ అంశాలతో కూడిన పూర్తిస్థాయి వినోదం అందించబోతోందనే అంచనాలతో ఈ సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. దీపావళి వారాంతానికి ముందు అక్టోబర్ 30న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

నటీనటులు: వెంకటేష్, శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, యువినా, రాజ్ ప్రజ్వల్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, ఉదయ్‌బీర్ సంధు, వెన్నెల కిషోర్, రఘుబాబు తదితరులు.

సాంకేతిక బృందం:
రచన -- దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్
సంగీతం: తమన్ ఎస్
ఛాయాగ్రహణం: రవి కె. చంద్రన్
ఎడిటింగ్: నవీన్ నూలి
కళా దర్శకత్వం: ఏ.ఎస్. ప్రకాశ్
ఫైట్స్: కెవిన్ కుమార్
పి ఆర్ ఓ: లక్ష్మీ వేణుగోపాల్
నిర్మాత: ఎస్. రాధాకృష్ణ (చినబాబు)
సమర్పణ: మమత
బ్యానర్: హారిక అండ్ హాసిని క్రియేషన్స్
విడుదల తేదీ: అక్టోబర్ 30, 2026

ఓటీటీలో జీవీ ప్రకాశ్, కయాదు హారర్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



మ్యూజిక్ డైరెక్టర్‌గా వరుస సినిమాలతో అలరిస్తున్న జీవీ ప్రకాశ్, కయాదు లోహర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ ‘ఇమ్మోర్టల్’ . మారియప్పన్ చిన్నా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది. ఇప్పుడు ఓటీటీలోనూ అలరించడానికి సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా అక్టోబరు 30వ తేదీ నుంచి తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోనూ స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ పోస్టర్‌ను పంచుకుంది.

ఇంతకీ కథేంటంటే..

మహి (జీవీ ప్రకాశ్‌కుమార్) హైదరాబాద్‌లోని తన మామయ్య ప్రింటింగ్ ప్రెస్‌లో డిజైనర్‌గా పనిచేస్తుంటాడు. అద్దె ఇంటి యజమాని పెట్టే పోరు భరించలేక వేరే ఇంటి కోసం వెతుకుతూ ఉంటాడు. తన జీతానికి తగిన ఇల్లు కోసం తిరుగుతూ విసిగి వేశారిపోతాడు. సరిగ్గా అప్పుడే, సింధు (కయాదు లోహర్) అనే అమ్మాయి ఫోన్ చేసి షేరింగ్ ఫ్లాట్ గురించి చెప్పడంతో ఆమె ఫ్లాట్‌కు వెళ్తాడు. తొలి చూపులోనే సింధుని చూసి ప్రేమలో పడతాడు. సింధు కూడా కలివిడిగా ఉంటూ మహితో ఇట్టే కలిసిపోతుంది. అతను ఏం అడిగితే అది క్షణాల్లో కొని పెడుతుంటుంది. అదే ఫ్లాట్‌లో ఉంటున్న సింధు తాతయ్య ఆకాశ్ (టీమ్ కార్తిక్) ద్వారా ఆమె గురించి ఓ రహస్యం తెలుస్తుంది. ఆ విషయం తెలిశాక మహి భయంతో వణికిపోతాడు. ఆ ఫ్లాట్ నుంచి, అపార్ట్‌మెంట్ నుంచి పారిపోదామనుకుంటాడు. అయితే, తిరిగి అక్కడికే వస్తాడు. ఇంతకీ సింధు గురించి మహికి తెలిసిన నిజం ఏంటి? వెయ్యేళ్ల కిందట ఆటవిక జాతిలో పుట్టిన మృగానికీ సింధుకూ ఉన్న సంబంధం ఏంటి? మహి ఆ అపార్ట్‌మెంట్ నుంచి ఎలా బయటపడ్డాడు? అన్నది చిత్ర కథ.

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775